

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

చిత్తూరు తిరుపతి

సోమవారం 1 సెప్టెంబర్ 2025 | పేజీలు 11




- 2018 టిడిపి ప్రభుత్వంలో కోటి 90 లక్షలు పనులకు శ్రీకారం..
- గత ప్రభుత్వంలో పనులు ప్రారంభం..
- 80 లక్షల నిధులు విడుదల.. నేటికీ పూర్తికాని ఆలయ నిర్మాణం..
- గోరంత పనులకు కొండంత నిధులు స్వాహా!..
- పత్తాలేని వైసీపీ కాంట్రాక్టర్..
- నిర్మాణ పనులలో అవినీతికి పాల్పడిన
- కాంట్రాక్టర్ పై చర్యలు ఏవి..?



## ఎస్ఆర్‌పురం ఆరిమణి గంగమ్మ ఆలయ నిర్మాణంలో

# గోల్‌మాల్..!

### కూటమి ప్రభుత్వమైనా పనులు చేయిస్తారన్న ఆశతో భక్తుల ఎదురుచూపులు..!

**చిత్తూరు బ్యూరో మేజర్ న్యూస్:** ఆంధ్ర, కేరళ, కర్ణాటక, తమిళనాడు ప్రఖ్యాతిగాంచిన చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురం మండలం ఆరుమని గంగమ్మ దేవాలయ నిర్మాణంలో గత ప్రభుత్వంలో పనులు ప్రారంభించిన ఓవైసీపీ కాంట్రాక్టర్ భారీ స్థాయిలో అవకతవకులకు పాల్పడి అమ్మవారి నిధులను దర్జాగా దోచుకున్నాడు. సాధారణంగా ప్రజల సొమ్మును అప్పనంగా కాల్ చేసే వారు ఎంతోమంది ఉన్న చివరకు దేవుళ్లను కూడా వదలకుండా వారి ఆదాయాన్ని సైతం అప్పనంగా కాజేసే మహానుభావులు గత ప్రభుత్వంలో ఉన్నారంటే వారి పాలన ఏ విధంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. అందుకు ప్రధాన ఉదాహరణ చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురం మండలం తయ్యూరు పాయకట్టు ఆరి మానిల గంగమ్మ దేవాలయం ఒకటి ఈ దేవాల యానికి నాలుగు రాష్ట్రాల నుండి ప్రధాన రోజులలో అమ్మవారి దర్శనార్థం వేలాది మంది భక్తులు వస్తు వారి కోరికలను ముడుపులను తీర్చుకుంటూ ఉంటారు. ఈ దేవాలయం దేవాదాయ ధర్మాదాయ పరిధిలోకి మిగతా 2లో..






## నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక: కలెక్టర్

**తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్ :** ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా కేంద్రం తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వ హిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ ఆది వారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలను జిల్లా కలెక్టరేట్ కు వచ్చే అవసరం లేకుండా మీకోసం.ap.gov.in వెబ్సైట్ నందు నమోదు చేసు కోవచ్చని, నమోదైన అర్జీల యొక్క ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నెంబర్ ను సంప్రదించగలరని పేర్కొన్నారు.

## కుప్పం నర్సింగ్ కాలేజిలో

# ఘనంగా స్నాతకోత్సవం

- విద్యార్థులు తమ కాలేజీని ఎంచుకున్నపుడే విజయానికి తొలిమెట్టు
- వంద శాతం ఉత్తీర్ణత సాధించి డిగ్రీ పట్టా పొందడం గర్వకారణం
- బిసి ఎన్ విద్యాసంస్థల బి.సి నాగరాజ్, డాక్టర్ సునీల్ రాజ్



వివరాలు 4లో..






# అందని వైద్యం

### చౌడేపల్లి ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు మృగ్యం...

### ప్రమాద క్షతగాత్రులు ప్రాథమిక వైద్యం కోసం వస్తే ప్రత్యక్ష నరకం...

**చౌడేపల్లి రూరల్, మేజర్‌న్యూస్** పుంగనూరు నియోజకవర్గం... రాష్ట్రంలో ఎప్పుడు సంచలనంగా ఉండే ఈ నియోజకవర్గంలో రాజకీయాలైతే వాడి వేడిగా ఉంటాయి కానీ.. పౌర సేవలు అందించడంలో మాత్రం అట్టడుగు స్థానంలో ఉంటుందన డానికి చౌడేపల్లి ప్రాథమిక ఆసుపత్రి ప్రభల నిదర్శనం. ఔను..! ఎవరు ఏమను కున్నా.. ఇది నిష్టూర సత్యం. చౌడేపల్లి ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు మృగ్యమ య్యాయి. వైద్యులు ఎప్పుడు అందుబాటులో ఉండడం లేదు. అత్యవసరమైతే రోగులు పరిస్థితి అంతే సంగతులు. ప్రమాద క్షతగాత్రులు ప్రాథమిక వైద్యం కోసం వస్తే ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. ఈనెల 28వ తేదీన ఉదయం అనుప్రియ (20), సునీత మిగతా 2లో..



# ఎస్ఆర్‌పురం ఆరిమణి గంగమ్మ
# ఆలయ నిర్మాణంలో గోల్‌మాల్



### మొదటిపేజీ తరువాయి

వచ్చినప్పటి నుండి అమ్మవారికి రోజు రోజుకి ఆదాయం పెరుగుతూ ఉండడంతో 2018 తెలుగుదేశం ప్రభుత్వం ఆలయాన్ని పునర్నిర్మానించి భక్తులకు మెరుగైన దర్శనం కల్పించాలని భావించింది ఆమెరకు శంకుస్థాపనలు చేయడమే కాకుండా సుమారు ఒక కోటి 90 లక్షల రూపాయలను ఆలయ పునర్నిర్మాణం కోసం కేటాయించడం జరిగింది. ఆ తర్వాత 2019లో ప్రభుత్వం మారడంతో ఆ పనులు ముందుకు సాగలేకపోయింది ఆ నేపథ్యంలోని గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు వైసిపి కి చెందిన కొంతమంది నాయకులు గత ప్రభుత్వం ఆలయ పునర్నిర్మాణానికి విడుదల చేసిన నిధులను ఎలాగైనా దోచుకోవాలన్న ఉద్దేశంతో. పాత ఆలయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ లోని కొంతమంది అవనితి సిబ్బంది అండదండలతో ఎలాంటి నిబంధనలు పూర్తిస్థాయిలో పాటించకుండా పాత ఆలయాన్ని కూలదోసి అంతవరకు ఆలయంలోని మూలస్థాన గంగమ్మవారిని ఓ షెడ్డులో ఏర్పాటుచేసి పనులు ప్రారంభించారు. ఈ పనులను గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్ పురం మండలం గ్రామానికి చెందిన ఓ వైసీపీ కాంట్రాక్టర్ చేపట్టడం జరిగింది. ఆ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించిన కొద్ది రోజులకే పనులను పూర్తిచేసే స్థాయికి వచ్చిందన్న తప్పుడు నివేదికతో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి విడుదల చేసిన సుమారు ఒక కోటి 90 లక్షల రూపాయలలో సుమారు 80 లక్షల రూపాయలను చెల్లించుకున్నాడు అని తెలిసింది. అయితే 50% మేరకు నిధులను తీసుకున్న ఆ కాంట్రాక్టర్ ఆ స్థాయిలో ఆలయ నిర్మాణాన్ని చేయలేక పోవడం పలు విమర్శలకు తావిస్తోంది. సుమారు 80 లక్షల రూపాయ లను తీసుకున్న ఆ కాంట్రాక్టర్ కేవలం 20 లక్షల రూపాయల పనులు కూడా చేయకుండా మధ్యలోనే ఆ పనిని వదిలివేసి కనుచూపుమేరకు కనిపించకుండా వెళ్లిపోయాడని భక్తుల ఆరోపిస్తున్నారు. అమ్మవారికి చెందిన సుమారు రెండు కోట్ల రూపాయల నిధులలో 50% నిధులను దర్జాగా దోచుకున్న ఆ వైసిపి కాంట్రాక్టర్ గురించి దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు గాని అప్పటి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు గాని ఏ మాత్రం పట్టించుకోకుండా ఆ కాంట్రాక్టర్ దోచుకున్న నిధులలో కొంత వాటాను తీసుకొని ఉండిపోయారని ఆరోపణలు అప్పట్లో భారీగా వినిపించింది. అయినా ఆ కాంట్రాక్టర్ ఏమాత్రం ఉలుకు పలుకు లేకుండా పూతలపట్టు నియోజకవర్గ పరిధిలోని మరో ప్రముఖ దేవాలయానికి సంబంధించిన కాంట్రాక్టు పనులను ప్రస్తుతం చేస్తూ అక్కడ కూడా తన చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నాడని కొంతమంది భక్తులు ఆరోపిస్తున్నారు. కథ ప్రభుత్వంలో ఆ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఓ మంత్రి కూడా ఈ వైసీపీ కాంట్రాక్టర్కు పుష్కలంగా వత్తాసు పలికినట్లు కూడా తెలుస్తోంది. అతని వత్తసుకుగాను ఈ కాంట్రాక్టర్ సుమారు 15 లక్షల రూపాయలను నజరానగా ఇచ్చినట్లు కూడా ఆరోపణలు గొప్పమన్నాయి. దాంతో అమ్మవారి ఆలయ నిర్మాణానికి సంబంధించి జరిగిన జరగకపోయినా ఏమి ప్రశ్నించకుండా ఉండిపోయారన్న ఆరోపణలు సైతం బలంగా వినిపించాయి. అయితే ప్రభుత్వం మారిపోయి ప్రస్తుతం కోటిని ప్రభుత్వం ఏర్పడిన ఆ వైసిపి కాంట్రాక్టర్ గురించి ఏ మాత్రం పట్టించుకోకపోగా అదనంగా మరో పనిని కూడా అతనికి అప్పగించడం వెనక ఆంతర్యం ఏమిటో భక్తులకు అర్థం కావడం లేదు. ప్రభుత్వ మారిందని కూటమి ప్రభుత్వం ఏర్పడిందని ఈ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మాణ దశలో ఉన్న మహా శక్తి కలిగిన ఎస్సార్ పురం మండలం తయ్యూరు పాయకట్టు ఆరి మాని గంగమ్మ పూర్తవుతుందని నమ్మకంతో ఉన్న భక్తులు నేటికీ అమ్మవారి ఆలయ పనులు ప్రారంభం కాకపోవడంతో షెడ్డులో ఉన్న ఆరిమాని గంగమ్మవారిని దర్శించుకుని వెళ్లవలసి పరిస్థితి నెలకొంది. మనుషులు తప్పు చేస్తే శిక్షించే దేవతలను కూడా గత ప్రభుత్వంలోని కొంతమంది పాలకులు, నాయకులు అందిన కాడికి దేవుళ్ళ ఆలయ ధనాన్ని కూడా దర్జాగా దోచుకున్నారు అనడానికి నిదర్శనంగా ఈ ఆలయం నిలవక మానదు... ఈ అవినీతికి సాహసించి అమ్మవారి సొమ్మును దోచుకుతున్న కాంట్రాక్టర్ గురించి మరో సంక్షేకులు కూడా పాఠకుల ముందు నేటి దినపత్రిక సూర్య తీసుకురానున్నది.

# అందని వైద్యం..

**అందుబాటులో ఉండని వైద్యులు..**
**అత్యవసరమైతే అంతే సంగతులు..**
**చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు..**
**ఏమి పట్టించుకోని ప్రజాప్రతినిధులు..**

### మొదటిపేజీ తరువాయి

(37) ఇద్దరు తమ స్కూటీలో చౌడేపల్లి వస్తున్న తరుణంలో చిన్న కొండా మరి వద్ద కుక్కలు అడ్డురావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడ్డారు. వారిని ఆరోగ్య చికిత్స నిమిత్తం చౌడేపల్లి ఆరోగ్య కేంద్రానికి తీసుకొని వచ్చారు. నడవలేని పరిస్థితిలో ఉన్న వాళ్లను కనీసం స్ట్రక్చర్ పైన తీసుకెళ్దామని చూసిన కనీస సౌకర్యాలు లేవు. అక్కడ వైద్యులు లేకపోయినా ఇతర సిబ్బంది వైద్యం చేస్తున్నారు. అక్కడికి వచ్చినవారు డాక్టర్ మోనాను చరవాణిలో సంప్రదించగా ఆవిడ ఆన్ డ్యూటీ పై చిత్తూరుకు వెళ్లానని చెప్పారు. ఇంచార్జ్ డాక్టర్ సోనియాని సెల్ ఫోన్ ద్వారా సంప్రదించగా లద్దిగం లో ఉన్నట్లు తెలియజేశారు. అత్యవసర వైద్య సేవలు అందించాల్సిన వైద్యులే ఇలా ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ అందుబాటులో లేకపోతే ఇక్కడికొచ్చే రోగులు, క్షతగాత్రుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు చోద్యం చూస్తూ ఉండడం.. ప్రజా ప్రతినిధులు రాజకీయాలు తప్ప తమకు ప్రజా సేవలు పట్టవన్నట్టుగా వ్యవహరిస్తుండడం రోగుల పాలిట శాపంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు చౌడేపల్లి ప్రాథమిక వైద్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషి చేయకపోతే కూటమి ప్రభుత్వం అభాసుపాలు కాక తప్పదు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్.. వ్యక్తికి గాయాలు



**పుంగనూరు, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని నల్లగుట్లపల్లి గ్రామ సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కొలుత్తూరు గ్రామానికి చెందిన బాలాజీ (23) ద్విచక్ర వాహనంలో పుంగనూరు వెళ్తుండగా, పుంగనూరు నుంచి రాయల్ పేట వైపు వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టడంతో బాలాజీకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని పుంగనూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## కూటమి ప్రభుత్వంలో ప్రైవేటు విద్యాసంస్థలకు మంచి గుర్తింపు



**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రైవేటు విద్యాసంస్థలకు మంచి గుర్తింపునిస్తోందని వెదురుకుప్పం మండలం దేవళంపేట సోక్రటీస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ గుణశేఖర్ అన్నారు. ఆదివారం కాకినాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైవేటు విద్యాసంస్థల కరస్పాండెంట్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఆయన అన్నారు.

## విద్యుత్తు షాక్ తో మహిళ మృతి



**యాదమరి మేజర్ న్యూస్:** ప్రమాదవశాత్తు విద్యుత్తు షాక్ తగిలి ఓ మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కథనం మేరకు మండల పరిధి నూర్ ఈ నగర్ ప్రాంతానికి చెందిన కలందర్ భార్య అరీఫా(40) ఇంటిలోని నీటి మోటారు స్విచ్ వెయ్యగా ప్రమాదవశాత్తు విద్యుత్తు షాక్ తగిలి కిందపడిపోయింది. గమనించిన ఆమె కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రి కి తరలించారు. అక్కడ విధులలో ఉన్న వైద్యులు ఆమెను పరీక్షించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మృతురాలి భర్త పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా అన్నదానం

**శ్రీకాళహస్తి మేజర్ న్యూస్ ,** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, వారి మిత్రబృందంనేతృత్వంలో శ్రీకాళహస్తి పట్టణం బేరివారిమండపం వద్ద వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా సోమవారం గణేష్ మహారాజుకి హోమం జరుగుతుంది, అన్నదాన కార్యక్రమం జరుగుతుంది ఈ మహత్కార్యంలో అందరు వినాయక స్వామి భక్తులు, వివిధ పార్టీలు, సంఘాలు నాయకులు, కార్య కర్తలు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ఉత్సవాల కమిటీ సభ్యులు కోరారు.



# హత్య కేసును ఛేదించిన పోలీసులు




**వెంకటగిరి మేజర్ న్యూస్** వెంకటగిరిలో రెండు రోజుల క్రితం వెంకటగిరి పట్టణం రైల్వే స్టేషన్ శివారు అటవీ శాఖకి చెందిన జామాయిలు తోటలో అమ్మాపాళెం గ్రామానికి చెందిన అటుపాక శివయ్యని దారుణంగా హత్య చేసిన కేసుని పోలీసులు చేదించి మూలింటి ముని జానకి రామ్ (20), పోలూరు సాయి కుమార్ (20) అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. స్థానిక పోలీసు స్టేషన్లో వెంకటగిరి సిఐ ఎ వి రమణ కేసు వివరాలను ఆదివారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలో కీర్తన ఫోటో స్టూడియో నిర్వహిస్తూ జీవనం సాగించే ఆటుపాక శివయ్య కనిపించటం లేదని ఆయన అన్న కోటేశ్వరరావు ఫోటో స్టూడియో వద్దకు వెళ్లి విచారిస్తుండగా ఆర్ టి సి నందు పని చేస్తున్న కుమార్ అనే వ్యక్తి కోటేశ్వరరావు వద్దకి వచ్చి మీ తమ్ముడు మూలింటి జానకిరామ్ తో కలిసి క్రాస్ రోడ్డు వైపు మోటారు సైకిల్ మీద వెళ్ళారని తెలిపాడు. అనంతరం క్రాస్ రోడ్డు నుంచి రైల్వే స్టేషన్ చుట్టు పక్కల వెతికే క్రమంలో పాత పెట్లూరు రోడ్డు మార్గంలో ఉండే జామయిల తోటలో ఆటుపాక శివయ్య మృతదేహం కోటేశ్వరరావుకి కనిపించింది. నిర్జీవంగా పడి ఉన్న శివయ్యని చూసి నిర్ఘాంతపోయిన కోటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాలు మేరకు డీ ఎస్ పి గీతా కుమారి ఆధ్వర్యంలో సంఘటనా స్థలాన్ని పరిశీలించి నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని సి ఐ ఎ వి రమణ తెలిపారు. గాలింపు చర్యల్లో భాగంగా నిందితులైన మూలింటి ముని జానకి రామ్, సాయి కుమార్ ఇద్దరు కాళహస్తి నుంచి వెంకటగిరికి వస్తున్నట్లు సమాచారం రావడంతో స్థానిక ఈ.ఎస్.ఎస్ డిగ్రీ కాలేజ్ వద్ద సిఐ ఎ వి రమణ, ఎస్ ఐ ఏడుకొండలు తమ సిబ్బంది సహాయంతో ఇద్దరి నిండుతులను ఛాకచక్యంగా అదుపులోకి తీసుకున్నట్లు సిఐ ఎ వి రమణ తెలిపారు.

**హత్యకు కారణం ఏమిటంటే..**

పట్టుబడ్డ ఇద్దరు నిందితులను విచారించగా మూలింటి జానకిరామ్ తండ్రి, పోలూరు సాయి కుమార్ అక్క ఇద్దరు ఆటుపాక శివయ్య (మృతుడు) చేతబడి చేయడం కారణంగానే చనిపోయారని ఇద్దరి నిందితులకు గట్టి నమ్మకమని సిఐ ఎ వి రమణ తెలిపారు. ఎక్కడికి వెళ్లినా మనల్ని కూడా చంపేస్తాడనే కారణంతో ఓ పథకం ప్రకారం మూలింటి జానకిరామ్ మృతుడు షాపు వద్దకు వచ్చి ఆటుపాక శివయ్యని మోటారు సైకిల్ మీద ఎక్కించుకుని వెళ్ళాడని సి ఐ రమణ తెలిపారు. శివయ్యకి తెలియకుండా పోలూరు సాయి కుమార్ వెనకాలే వెంబడించి రైల్వే స్టేషన్ సమీపంలోని జమాయిలు తోటలో మద్యం సేవించి బలమైన కర్ర, సన్నటి రాడ్డు తో ఇద్దరూ కలిసి ఆటుపాక శివయ్య తలపై కొట్టి తీవ్రంగా గాయపరిచారు. ఆపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆటుపాక శివయ్య ఇంకా చనిపోలేదని నిర్ధారించుకుని మందు బాటిల్ తో గొంతుపై విచక్షణారాహితంగా పొడిచి హత్య చేసి మోటారు సైకిల్ పై ఇద్దరు నిందితులు పరారయ్యారని సిఐ ఎ వి రమణ తెలిపారు.

# శ్రీకాళహస్తి గ్రంథాలయాన్ని సందర్శించిన రాష్ట్ర డైరెక్టర్లు



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణం గ్రేడ్ వన్ గ్రంథాలయాన్ని రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ కృష్ణమోహన్ చిత్తూరుజిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్ వి ఆర్ ఎస్ ఎస్ శర్మ గ్రంథాల యాన్ని పరిశీలిం చారు. ఈ సందర్భంగా గ్రంథాల యంలో పాఠకులతో మాట్లాడుతూ ఈ గ్రంథాలయంలో ఏవిధంగా పాఠకులకు సేవలు అందుతున్నాయో అడిగి తెలుసుకు న్నారు. అనంతరం గ్రంథాలయాన్ని పరిశీలిం చారు చదవడం మాకు ఇష్టం క్విజ్ కాంటీషన్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమ తులను అందజేశారు. గ్రంథాలయ అధికా రిని లావణ్య రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు కృష్ణమోహన్‌కి స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచేందుకు యువతలో వారికి సంబం ధించిన కాంపిటీషన్ పరీక్షల్లో విజయం సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రంథా లయాలలో అనేక ఏర్పాటు చేసి వాళ్లకు సంబంధించిన పుస్తకాలు ఈ గ్రంథా లయంలో పొందుపరుస్తుందని, ఈ పుస్తకా లను చదవడం వల్ల విద్యార్థుల్లో యువతలో నైపుణ్యాన్ని పెంచి వారి ఎదుగుదలకు ఎంతో దోహదపడుతుందని తెలి యజేశారు. ప్రతి ఆదివారం విద్యార్థులు గ్రంథాలయాన్ని సందర్శించి , గ్రంథాలయం లోని పుస్తకాలు చదవడం వల్లవారికి వారి నైపుణ్యాన్ని పెంపొందించే విధంగా గ్రంథాలయ అధికారులు ఎప్పటికప్పుడు కార్యాచరణ చేపడుతున్నారని తెలియజేశారు రాష్ట్రంలో యువత గ్రంథాలయంలో చదివి అనేకమంది పోలీస్ రిక్రూట్మెంట్లో 300 మంది ఉద్యోగాలు సంపాదించారని అదే విధంగా మొన్న జరిగిన డీఎస్సీ పరీక్షల్లో ఇదే గ్రంథాల యంలో చదివి అనేకమంది ఉద్యో గాలు సంపాదించారని ఆనందం వ్యక్తం చేశా రు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి అందుబాటులో గ్రంథాలయం ఉంటుందని ప్రతి వచ్చి విజ్ఞా నాన్ని పెంచుకోవాల్సిందిగా ఆయన పాఠకులను కోరారు.



## రక్తదాన శిబిరాలను జయప్రదం చేయండి

### - జనసేన పార్టీ నేతలు పేటా బ్రదర్స్

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ జనసేన పార్టీ అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా పేట బ్రదర్స్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2 వతేదీ రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతున్నది, పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసేన నాయకులు, వీర మహిళలు, జన సైనికులు, కూటమి నాయకులు, మరియు సేవా దృక్పథం ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదాతలయ్యి ప్రాణదాతలు అవుతారని పేట బ్రదర్స్ కోరారు. డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం నిర్వాహకులు, జనసేన నాయకులు శ్రీకాళహస్తి నియోజకవర్గం హాజరు కావాలని కోరారు. రక్త దాతలు క్రింది సెంటర్లకు హాజరు కావాలని కోరారు. శ్రీకాళహస్తి పట్టణం రోటరీ క్లబ్, శ్రీరామ్ నగర్ లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.



## పురపాలక శాఖలో మణి శంకర్ సేవలు ఆదర్శం

### - దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** పుత్తూరు మున్సిపాలిటీ మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న శ్రీకాళహస్తి నివాసి మోదుగుల గోపాలయ్య మణి శంకర్ రిటైర్మెంట్ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు శేష వస్త్రం సత్కరించి స్వామి అమ్మవార్ల చిత్రపటం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి సురేష్, మొగరాల గణేష్, ,బాల్ శెట్టి విజయ్ శేఖర్, పూడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయంలో అన్నదాన కార్యక్రమం



**కార్వేటినగరం (మేజర్ న్యూస్):** కార్వేటినగరం లో వెలసిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో మేన పాటి దేశమ్మ వర్ధంతి జ్ఞాపకార్థం వారి కుమారుడు మేనపాటి సుబ్రహ్మణ్యం వారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి సురేష్ కుమార్ భక్తులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సుమతికి నివాళులు

**కార్వేటినగరం (మేజర్ న్యూస్):** కార్వేటినగరం మండలం ఆర్ కే వి బి పేట పంచాయతీ దళిత వాడికి చెందిన సుమతి విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మృతదేహానికి గంగాధర్ నెల్లూరు జనసేన పార్టీ నియోజకవర్గ బాధ్యులు మరియు మాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ యుగంధర్ మృతదేహానికి పూలమాలేసి నివాళు లర్పించారు. వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ ఇన్నాళ్ల కార్యక్రమంలో మండల అధ్యక్షులు శోభన్ బాబు, జిల్లా సంయుక్త కార్యదర్శి రాఘవ, నియోజకవర్గ యువజన ప్రధాన కార్యదర్శి అన్నామలై, పంచాయతీ ప్రెసిడెంట్ వినోద్ పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ రాజేష్, జనసేన పార్టీ నాయకులు అశోక్, సునీల్, జైపాల్ భాగ్యరాజ్ ,పాల్గొన్నారు.



# జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి

### - ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



**చిత్తూరు ప్రతినిధి, మేజర్ న్యూస్:** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడప్, డిఆర్డీఎలు సంయుక్తంగా నిర్వహిస్తున్న జాబ్ మేళాను జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 2వ తేదీ మంగళవారం పీవీకేఎన్ కళాశాలలో జరిగే జాబ్ మేళాలో టాప్ ఎంఎన్సీ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ పాస్ ఫెయిల్ విద్యార్హతతో 18-35 సంవత్సరాల వయస్సు ఉన్న యువతీ యువకులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చన్నారు. పూర్తి సమాచారం కోసం ఫోన్ నెంబర్లు 8465830771, 9963561755 సంప్రదించవచ్చని తెలిపారు. చిత్తూరు నియోజకవర్గంలో ఇదివరకే రెండు దఫాలు జాబ్ మేళాలు నిర్వహించి సుమారు వెయ్యి మందికి పైగా ఉద్యోగ అవకాశాలు పొందారన్నారు. జాబ్ మేళా అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## 16 మందికి గొడుగులు పాదరక్షలు పంపిణీ



**కోట, మేజర్ న్యూస్**
కోట మండల కేంద్రంలోని శ్రీశ్రీ శ్రీ కోటమ్మ తల్లి ఆలయ ప్రాంగ ణంలో శ్రీ సీతా రామ థార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 16 మందికి గొడు గులు, పాదరక్షలు అందజేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఆవుల సుబ్బయ్య,కోటమ్మ దంపతుల ఆర్థిక సౌజన్యంతో పదివేల రూపాయల విలువచేసే గొడుగులు, పాదరక్షలను శ్రీ షిరిడి సాయి అక్షయ సేవా సమితి అల్లం రమణయ్య,ప్రగతి విద్యా సంస్థల పసుపులేటి కిషోర్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వారికి ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పెళూ ్లరు కోటేశ్వర రెడ్డి,బాబూరావు, పన్నగ సాయి, సంస్థ ప్రతినిధులు దీవి అనంత బాబు,హేమంత్ శర్మ,నరేష్ శర్మ, సాయి బాబు,నందకుమార్ శర్మ పాల్గొన్నారు.



## స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ

**కార్వేటినగరం (మేజర్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు బదులుస్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్నది. కార్వేటి నగరం మండలంలోని కొల్లగుంట అరుంధతి వాడలో ప్రజలకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిఎన్ టి యు సి ఉపాధ్యక్షులు సుమన్ మాట్లాడుతూ ఈ స్మార్ట్ కార్డు ద్వారా ప్రజలకు బియ్యం పంపిణీసులభకరమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# బంగారు రుణం.. ప్రగతికి ప్రయోజనం

### పి.ఎ.సి.యస్.అధ్యక్షులు వి.కృష్ణమూర్తి



**కుప్పం,మేజర్ న్యూస్:** కుప్పం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా పొందే బంగారు రుణం.. ప్రగతికి ప్రయోజనం అని పి.ఎ.సి.ఎస్.అధ్యక్షులు వి.కృష్ణమూర్తి పేర్కొన్నారు..వారు మాట్లాడుతూ కుప్పం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నందు బంగారు ఆభరణాల పై తక్కువ వడ్డీకి అధిక మొత్తము రుణములు ఇస్తున్నట్లు తెలిపారు. వడ్డీ రేటు కేవలం 0.87 పైసలు మాత్రమేనని, గోల్డ్ లోను ఒక గ్రాముకి రూ 6700/- లతో పది నిమిషాలలో లోను ఇవ్వబడునని తెలిపారు.కావున ఈ అవకాశాన్ని కుప్పం ప్రజలు, రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎం.రాజేంద్ర, డైరెక్టర్లు ఎం.అన్నాధురై, ఎస్.కృష్ణవేణి లు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం బలోపేతం చేయడంతో పాటు రైతులకు మరిన్ని సేవలు అందించేలా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిం దన్నారు. వ్యవసాయ సహకార సంఘం ద్వారా బంగారు తాకట్టు రుణాన్ని మంజూరు చేస్తున్నామ న్నారు. ముఖ్యంగా రైతులకు సకాలంలో ఉపయోగపడే విధంగా అండగా నిలిచేందుకు యత్ని స్తున్నామన్నారు. సమాచారం కొరకు నంబర్లను 9032285 310, 9550160405 సంప్రదించాలని తెలిపారు.

# వర్సిటీలు భవితవ్యం ప్రశ్నార్థకమేనా...!

**కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి విద్యార్థుల జీవితం**
**టెండర్లు ఆహ్వానించే ప్రయత్నంలో వర్సిటీ అధికారులు**
**ప్రైవేటీకరణ చేసే కుట్రకు యత్నిస్తే అడ్డుకుంటాం**
**విద్యార్థి సంఘాల హెచ్చరిక**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** యూనివర్సిటీల భవితవ్యం ఆగమ్యగోచరంగా తయారైంది. కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను సర్వనాశం చేస్తున్న నేపథ్యంలో వర్సిటీలలో ప్రైవేటు సంస్థల ఆధిపత్యాన్ని ప్రోత్సహించేందుకు మరో అడుగు ముందుకేస్తోంది. ఇందులో భాగంగా డిగ్రీ, పీజీ విద్యార్థుల అడ్మిషన్ల వివరాలతో పాటు విద్యార్థులకు నిర్వహించే సెమిస్టర్ పరీక్షలు, ప్రశ్నాపత్రాల మూల్యాంకనంతో పాటు, ఫలితాల వెల్లడి ఇక ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు అధికారులు అడుగులు వేస్తున్నారు. ఈ మేరకు ఓ పేరొందిన సాఫ్ట్వేర్ కంపెనీ సూచనల మేరకు ఎస్వీయూ అధికారులు టెండర్లు పిలవనున్నారు. దీంతో ఉన్నత చదువులను అభ్యసించే విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారనుంది. విద్యార్థుల భవిత్యం పూర్తిగా ప్రైవేటు, కార్పొరేట్ సంస్థల ఆధీనంలోకి వెళ్లనుంది.

**టెండర్లను ఆహ్వానించే దిశగా ఎస్వీయూ....** ఎగ్జామినేషన్ సెక్షను ప్రక్షాళణ చేస్తున్నామంటూ వర్సిటీ అధికారులు ప్రైవేటు సంస్థలకు టెండర్లు ఆహ్వానించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించాలనే ఉద్దేశంతో ఆ సంస్థ సూచించిన ఆదేశాలతో తూతూ మంత్రంగా టెండర్లు పిలిచి ఇప్పటికే నిర్ణయం తీసుకున్న బహుళ జాతి కంపెనీ చేతుల్లో పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీంతో విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ నుంచి డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షల నిర్వహణ, పేపర్ల మూల్యాంకన, ఫలితాల వెల్లడిని ప్రైవేటు సంస్థల చేతులలో పెట్టేందుకు నిర్ణయం తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు తెలుస్తోంది.

**వర్సిటీల భవితవ్యం ప్రశ్నార్థకం....!** అత్యధికంగా వర్సిటీలలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తుంటారు. కానీ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూటమి ప్రభుత్వం ఉన్నత విద్యను దూరం చేస్తోంది. ఇందులో భాగంగానే ఇప్పటికే ఎస్వీయూ లాంటి ప్రధాన వర్సిటీలలో పలు కోర్సులను రద్దు చేస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇటీవల ఆర్ట్స్ విభాగంలో పదుల సంఖ్యలో కోర్సులను వీలనం పేరుతో రద్దు చేసిన అధికారులు, అకడమిక్ కన్సల్టెంట్లను సైతం తొలగించారు. దీంతో పెద్దఎత్తున తాత్కాలిక అధ్యాపకులు, విద్యార్థుల నిరసన వ్యక్తం చేసినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఎస్వీయూలో పేద విద్యార్థులు చదివే కోర్సులకు చరమగీతం పాడిన వర్సిటీ అధికారులు ప్రస్తుతం వర్సిటీని ప్రైవేటీకరణ చేయడం దారుణమని మేధావులు, విద్యార్థి సంఘాలు విరుచుకపడుతున్నాయి.

# ట్రాక్టర్ బోల్తా.. 9 మంది భక్తులకు గాయాలు

**వాకాడు, మేజర్‌న్యూస్:** వాకాడు మండలం తూపిలిపాళెం సముద్ర తీరానికి నిమజ్జనానికి వెళుతున్న ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో 9 మంది భక్తులకు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు వాకాడు మండలం కాశీపురం గ్రామానికి చెందిన దాదాపు 26 మంది భక్తులు ఎంతో ఉత్సాహంగా వినాయక యవితి ఉత్సవాలు' నిర్వహించుకుని ట్రాక్టర్పై విగ్రహాన్ని తీసుకుని సముద్రంలో నిమజ్జనం చేసేందుకు తూపిలిపాళెం బయలుదేరారు. గ్రామం నుంచి బయలుదేరిన ట్రాక్టర్ 20 నిమిషాలు కాకముందే అదుపుతప్పి స్వర్ణముఖి నది కరకట్టపై నుంచి నదిలోపలి ముళ్ళపొదల్లోకి తిరగబడిపోయింది. ట్రాక్టర్ ట్రక్కులో ఉన్న భక్తుల్లో 9 మందికి గాయాలు తగిలాయి. గ్రాయపడిన శివ, సుశాంత్, సాయి, ధోణి, కిషోర్, అనిల్, పవన్, నాగేంద్ర, తరుణను వాకాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరికి మాత్రం తీవ్ర గాయాలు తగలడంతో అస్వస్థతకు గురైనారు. గాయపడిన వారి కుటుంబ సభ్యులతో ఆసుపత్రి ఆవరణం కన్నీటి రోధనలతో నిండుకున్నాది. గ్రాయపడిన వారిలో ఎక్కువ మంది విద్యార్థులే ఉన్నారు.





# నేడు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు రాక

**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన పెళ్లకూరులో గల చాగణం లలితమ్మ భాస్కర్ రావు మెమోరియల్ ట్రస్ట్‌కు నేడు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు విశిష్ట అధిథులుగా విచేస్తున్నారని ట్రస్ట్ సీఈఓ పెనుబల్లి సీతారామ్ నాయుడు అన్నారు. వారు మాట్లాడుతూ ట్రస్ట్‌లో ఏర్పాటు చేసిన పలు నైపుణ్య అభివృద్ధి కేంద్రాలను,మెడికల్ ల్యాబ్‌ను, ఉచిత కల్యాణ మండపాన్ని, పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా మొక్కల పెంపకం ఇలా మొదలగు వాటిని వారు సందర్శిస్తారన్నారు. లలితమ్మ విద్యా వికాస ఉపకార వేతనాన్ని వారు చేతుల మీదుగా పంపిణీ చేస్తామన్నారు. అదేవిదంగా డీ-అడిక్షన్ సెంటర్‌ను వారి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ట్రస్ట్‌ను ఉద్దేశించి ప్రశంగిస్తారన్నారు. మండలంలోని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# ఘనంగా నెమలి వాహన గణపయ్య ప్రత్యేక పూజలు

**అన్నదాన కార్యక్రమం నిర్వహించిన నిర్వాహకులు**

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** నగరంలోని స్థానిక 32వ డివిజన్ నందు వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా ఏర్పాటుచేసిన నెమలి వాహన గణపయ్యకు ఆదివారం మండప నిర్వహకులు శివయ్య, హర్షవర్ధన్, విక్రమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారికి విశేష అలంకరణ జరిపి మధ్యాహ్నం 350 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ వరద, 32 వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ హేమావతిలు పాల్గొన్నారు. వారి చేతుల మీదుగా భక్తులకు స్వామివారి అన్న ప్రసాదాలను అందించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది 32 వ డివిజన్ పరిధిలోని మెయిన్ రోడ్డు నందు ఎలాంటి వసూలు లేకుండా మహిళలే నిర్వహిస్తున్న వినాయక స్వామి ఉత్సవాలు అత్యంత అద్భుతంగా ఉన్నాయని అన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది స్వామి వారి వినాయక చవితి ఉత్సవాలు బాగా నిర్వహించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రమేష్ రెడ్డి, హరి గణేష్, వాసు, జ్యోతి ప్రకాష్, రమేష్, నాగయ్య,మునిరత్నం, మహిళ నిర్వహకులు గిరిజ, రమ, మీనా, ప్రియా,యమునా, సరిత తదితరులు తోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# 71వ వసంతంలోకి ఎస్వీయూ

**ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యంగా ఎన్ఐపీ అమలు**
**ఎందరో మహనీయులను దేశానికి అందించిన ఘనత ఎస్వీయూదే**
**నాన్ టీచింగ్ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో రేపు ఘనంగా 71వ వార్షికోత్సవం**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** రాయలసీమకే తలమానికంగా వెలసిల్లుతున్న శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం 71వ వసంతంలోకి



అడుగులు పెడుతోంది. విద్యా, ఉపాధి కల్పనే లక్ష్యంగా 70 ఏళ్లు పాటు విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పిన శ్రీ వేంకటేశ్వరా విశ్వ విద్యాలయం మంగళవారం నాటికి 70 ఏళ్లు పూర్తి చేసుకుని 71వ పడిలోకి ప్రవేశిస్తోంది. మద్రాసు యూనివర్సిటీతో అనుబంధ సంస్థగా ఉన్న ఎస్వీయూను 1954వ సంవత్సరం సెప్టెంబర్ 2వ తేదీన టంగుటూరి ప్రకాశం పంతులు కృషితో ఎస్వీయూనివర్సిటీగా రూపాంతరం చెందింది. టీటీడీ నుంచి సుమారు 904ఎకరాల విస్తీర్ణాన్ని 99ఏళ్ల లీజు ప్రాతిపధికన తీసుకుని వర్సిటీని ఏర్పాటు చేశారు. తొలి ఏడాదిలో ఆరు మేజర్ విభాగాలతో ప్రారంభమైన వర్సిటీ నేడు 52 విభాగాలతో 60 కోర్సులలో 6వేల మంది విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తోంది. ఇప్పటికే నాక్ ఏ గ్రేడ్ పొందిన వర్సిటీ త్వరలో ఏప్లస్ గ్రేడ్ను సాధించేందుకు ప్రయత్నిస్తోంది.

**రేపు ఘనంగా ఎస్వీయూ వ్యవస్థాపక దినోత్సవం....** 904ఎకరాల విస్తీర్ణాన్ని 99ఏళ్ల లీజు ప్రాతిపధికన తీసుకుని వర్సిటీని ఏర్పాటు చేశారు. తొలి ఏడాదిలో ఆరు మేజర్ విభాగాలతో ప్రారంభమైన వర్సిటీ నేడు 52 విభాగాలతో 60 కోర్సులలో 8వేల మంది విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తోంది. ఇప్పటికే నాక్ ఏ గ్రేడ్ పొందిన వర్సిటీ త్వరలో ఏప్లస్ గ్రేడ్ను సాధించేందుకు ప్రయత్నిస్తోంది. ఎస్వీ యూనివర్సిటీ 71వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈనెల 2వ తేదీ మంగళవారం నాన్ టీ చింగ్ స్టాఫ్ ఆధ్వర్యంలో వర్సిటీలోని శ్రీనివాస ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఉద్యోగుల క్రీడా పోటీలు పూర్తి చేశారు. వర్సిటీ పరిపాలనా భవనాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉద్యోగులకు 15నిమిషాలకు ఒక సారి లాటరీ విధానం ద్వారా బహుమతులను అందించనున్నట్లు నాన్టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు జి శ్రీధర్, సెక్రటరీ సుబ్రమణ్యం తెలిపారు.

# కుప్పం నర్సింగ్ కాలేజిలో ఘనంగా స్నాతకోత్సవం

**విద్యార్థులు తమ కాలేజీని ఎంచుకున్నపుడే విజయానికి తొలిమెట్టు**
**వంద శాతం ఉత్తీర్ణత సాధించి డిగ్రీ పట్టా పొందడం గర్వకారణం**
**బిసి ఎన్ విద్యాసంస్థల బి.సి నాగరాజ్, డాక్టర్ సునీల్ రాజ్**

**కుప్పం, మేజర్‌న్యూస్:** కుప్పం నర్సింగ్ కాలేజీలో స్నాతకోత్సవం వేడుకలను కళాశాల ఛైర్పర్సన్ ఎన్.శాంతానాగరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.బెంగళూరుకు చెందిన విజయనగర్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, ప్రిన్సిపాల్ డా.వసంత సింగరాయన్ ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా విచ్చేశారు. డా.వసంత సింగరయన్ మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభతో పాటు ఉత్తమసేవ ప్రదానం. ప్రస్తుత సాంకేతిక పరంగా అవగాహన కలిగి ఉత్తమ సేవకు ప్రయత్నం చేయాలని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కళాశాల వైస్ ఛైర్మన్ సునీల్ రాజ్ మాట్లాడుతూ విద్యార్దులు తమ కాలేజీని ఎంచుకున్నపుడే





విజయానికి తొలిమెట్టు అని విద్యార్థులను అభినందించారు. డా.బి.సి.నాగరాజ్ మాట్లాడుతూ కాలేజీ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించి డిగ్రీ పట్టా పొందడమే కాక 11 మంది డిస్టింక్షన్ సాధించడం చాలా గర్వకారణమన్నారు. 2025 సంవత్సరంలో జరిగిన పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశామన్నారు. కళాశాల సెక్రటరీ సాగర్ రాజ్ ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యానగర్‌లో ముగిసిన క్రీడా దినోత్సవాలు




**కోట, మేజర్‌న్యూస్:** మండలంలోని నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడాదినోత్సవ కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు కార్యక్రమములో భాగంగా సుమారు 30 మంది విద్యార్థులతో సైకిల్ ర్యాలీని డాక్టర్ సి.రవీంద్ర రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ అనంతరం విద్యార్థులచే మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. టెక్నాలజీలో హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా ఆగస్టు 29ని భారతదేశంలో జాతీయ క్రీడా దినోత్సవంగా పాటిస్తున్నామని, కేంద్ర సర్కార్ వారి ఆదేశాల మేరకు "ఏక్ ఘంటా ఖేల్ కే మైదాన్ మే" నినాదంతో 3 రోజుల పాటు జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల కోసం క్రీడాపోటీలు, సైకిల్ ర్యాలీ, విద్యార్థులచే మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కళాశాల సైన్స్, హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ సి.రవీంద్రరెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై, మేజర్ ధ్యాన్‌చంద్ భారత హాకీకి, దేశానికి మేజర్ ధ్యాన్ చంద్ చేసిన కృషిని ఆయన స్ఫూర్తిదాయకమైన జీవిత కథను విద్యార్థులతో పంచుకున్నారు. విద్యార్థుల మొత్తం వ్యక్తిత్వాన్ని రూపొందించడంలో క్రీడలు, శారీరక విద్య యొక్క ప్రాముఖ్యతను ఆయన ఈ సమావేశంలో వివరించారు. ఆయనక్రమశిక్షణ, అంకితభావం నుండి ప్రేరణ పొందేలా విద్యార్థులను ఉద్దేసించి మాట్లాడుతూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధిపతి డాక్టర్ వి.మల్లికార్జున రెడ్డి నేతృత్వంలో అందరికీ వినోదపు ఆటలు, ఉత్తేజకరమైన వాలీబాల్ ఆట పోటీలను, మహిళలకు త్రోబాల్ ఆటపోటీలనునిర్వహించారు. విజేతలకు డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి బహుమతులు ప్రదానంచేసారు. విద్యార్థులచే మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్ ఇలాంటి కార్యక్రమాలకు సహకరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయమ విద్యావిభాగ అధ్యాపకురాలు శోభారాణి, అధ్యాపకులు పి.రాముకుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కాణిపాకం గణనాథుని సేవలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్

**ఐరాల (మేజర్‌న్యూస్):** కాణిపాకం స్వయంభూ వరసిద్ధి వినాయక స్వామి వారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమీషనర్ చావాలి సునీల్ స్వామివారిని శనివారం ఉదయం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు, స్వామి వారి సందర్శనార్ధం విచ్చేసిన వారికి ఆలయ సాంప్రదాయ ప్రకారం రాజగోపురం వద్ద ఆలయ ఈఓ పెంచల కిషోర్ ఎఈఓ రవీంద్ర బాబు, డీఈఓ సాగర్ బాబు అర్చకులు సూపరింటెండెంట్ కోదండపాణి, వేదపండితులు, అర్చకులు రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి వారి సేవలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత ఆలయ అశ్వరచన మండపంలో వేద పండితులచే అశ్వరచన చేసిన తరువాత ఆలయ ఈవో చేతులు మీదగా స్వామి వారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాలు, శేష వస్త్రాలు, అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

# మద్యం మత్తులో రూ.160లు ఇవ్వలేదని కత్తితో దాడి

### ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందజేత... వివరాలు సేకరించిన సీఐ బాబీ


**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** మద్యం మత్తులో వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన నాయుడుపేట పట్టణంలోని గాంధీ పార్క్ వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన అవదాని నరసయ్య, సురేందర్ రెడ్డిలు కలిసి మద్యం సేవించారు. ఈ క్రమంలో నరసయ్య తన వద్ద తీసుకున్న రూ.160ల నగదు ఇవ్వాలని సురేందర్ రెడ్డిని అడగగా కోపోద్రిక్తుడైన సురేందర్‌రెడ్డి కత్తితో నరసయ్యను హతమార్చేందుకు ప్రయత్నించాడు. స్థానికులు గుర్తించి హుటాహుటిన గాయపడిన నరసయ్యను నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. ఈ సమాచారం అందుకున్న అర్బన్ సీఐ బాబీ ఆసుపత్రికి చేరుకుని బాధితుడిని అడిగి వివరాలు సేకరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## ఉపాధ్యాయుడికి తెలుగు తేజం పురస్కారం

**కార్వేటినగరం (మేజర్ న్యూస్):** ఐఎస్ఓ గుర్తింపు పొంది సాహిత్యంలో 36 ప్రపంచ రికార్డులు సాధించిన జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సేవాసంస్థ శ్రీశ్రీ కళా వేదిక వారు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు గారి జన్మదినం సందర్భంగా తెలుగు భాష, తెలుగు వైభవం, తెలుగు సంస్కృతి- సంప్రదాయాల అభివృద్ధికి సాహిత్యం, కళలు, వివిధ రంగాల ద్వారా తెలుగు భాషాభివృద్ధికి అపూర్వమైన కృషి చేస్తున్నందుకు చిత్తూరు జిల్లా కార్వేటి నగరానికి చెందిన ఉపాధ్యాయుడు, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులు కరణం గిరిబాబు తెలుగు తేజం పురస్కారం అందజేశారు. వీరు ఈ అవార్డును పల్నాడు జిల్లా నరసరావుపేటలో భువన చంద్ర టౌన్ హాలులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కరణం గిరిబాబు పూలమాల, శాలువా, మెమెంటో అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ అవార్డు తనకు అందజేసినందుకు శ్రీశ్రీకళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్ గారికి, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం, జాతీయ కమిటీకి ధన్యవాదాలు తెలియజేశారు. కార్వేటినగరం మండలవిద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, పుర ప్రముఖులు, గ్రామస్థులు కరణం గిరిబాబు సీఆర్పీ గణేష్ అభినందించారు.



# హైవేలో అండర్ బ్రిడ్జి నిర్మించాలని శవంతో ధర్నా

**రొంపిచెర్ల, మేజర్‌న్యూస్:** నేషనల్ హైవేలోని రొంపిచెర్ల క్రాస్ వద్ద అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ప్రజలు ఆదివారం నేషనల్ హైవే ధర్నా నిర్వహించారు. శనివారం రాత్రి మృతి చెందిన కూలీ జయచంద్ర శవంతో రోడ్డుకు అడ్డంగా ఆటోలు పెట్టి ధర్నా కు దిగారు. బెంగళూరు- తిరుపతి జాతీయ రహదారిలోని రొంపిచెర్ల క్రాస్ రోడ్డు వద్ద అండర్ బ్రిడ్జి లేక పోవడం వలన నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు దాటుతూ ప్రమాదాలకు గురై పలువురు మృతి చెందారని అన్నారు. ఇక్కడ అండర్ బ్రిడ్జి నిర్మించాలని హైవే అధికారులకు, జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన లాభం లేదన్నారు. శనివారం రాత్రి కూడా రాయి కొట్టే కూలి జయచంద్ర రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని మృతి చెందారని తెలిపారు. నిత్యం ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్న అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఇక్కడ అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని, లేదా రోడ్డుకు 20 అడుగులు ఎత్తులో పైన ఐరన్ పైపులుతో రోడ్డు వేయాలని కోరారు. హైవే లో ధర్నా చేయడంతో భారీ సంఖ్యలో వాహనాలు నిలిచి పోవడంతో రొంపిచెర్ల ఎస్ఐ సుబ్బారెడ్డి అక్కడికి చేరుకున్నారు. నేషనల్ హైవేలో ధర్నా చేయరాదని ఏదైనా సమస్య ఉంటే కాంట్రాక్టర్ తో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ప్రజలు ధర్నాను విరమించారు. అయితే సమస్య పరిష్కారం కాకపోతే మళ్ళీ ధర్నా చేస్తామని ప్రజలు హెచ్చరించారు.





## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదు

### గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

**వాకాడు, మేజర్‌న్యూస్:** వాకాడు మండలం తూపిలి పాలెం వద్ద సముద్ర తీరానికి నిమజ్జనం కోసం తీసుకోని వస్తున్న గణేష్ విగ్రహాలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం వాకాడు మండలం తూపిలి పాలెంలో ఏర్పాట్లను గూడూరు సబ్ కలెక్టర్ మీనా పరిశీలించారు. నిమజ్జన ఏర్పాట్లను భక్తులకు ఎలాంటి వందలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు. వివరాలు అధికారుల ద్వారా ఆయన అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సంఘటనలు జరిగిన వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఆయన వెంట తాసిల్దార్ సయ్యద్ ఇక్బాల్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్, ఎక్సైజ్ ఎస్సైరషీద్ భాష, మెరైన్, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, వివిధ శాఖల అధి కా ర ు ల ు ఉన్నారు.



## మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం దంపతులకు సన్మానం

### ఏఎంసి డైరెక్టర్లు దువ్వూరు పవిత్ర రెడ్డి, కోటేశ్వరరావు యాదవ్

**ఓజిలి, మేజర్‌న్యూస్:** నాయుడుపేట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఏఎంసీ డైరెక్టుగా ఎన్నికైన సందర్భంగా ఆదివారం మాజీ ఎంపీ సూళ్లూరుపేట నియోజకవర్గం ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం నివాసంలో ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం దంపతులను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు నూతనంగా ఎన్నికైన ఏఎంసి డైరెక్టర్లు దువ్వూరు పవిత్ర రెడ్డి, కోటేశ్వరరావు యాదవ్. అనంతరం వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం దంపతులు నూతనంగా ఎన్నికైన ఏఎంసి డైరెక్టర్లు దువ్వూరు పవిత్రరెడ్డి, కోటేశ్వరరావుయాదవ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు రైతులకు అందుబాటులో ఉంటూ అండగా ఉండాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి సముచిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. పార్టీకి కష్టకాలంలో నిలబడ్డ ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సముచిత స్థానం కల్పిస్తారని, అదేవిధంగా పదవులు పొందిన ప్రతి ఒక్కరూ తమ పదవిని ఒక బాధ్యతగా నిర్వర్తించాలని, రానున్న ఎలక్షన్లలో అందరూ కలిసికట్టుగా పనిచేసి తెలుగుదేశం పార్టీ విజయాన్ని కృషి చేయాలన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసి, తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు తాగాలని నాయకులకు సూచించారు. వారి వెంట నాయకులు కె.గురునాథ్, ప్రేమ్ కుమార్ ఉన్నారు.



## వైఎస్ఆర్సీపీ మండల కార్యదర్శిగా మాబాషా ఎంపికపై హర్షం

**చిట్టమూరు, మేజర్‌న్యూస్:** వైయస్సార్సీపి చిట్టమూరు మండల కార్యదర్శిగా మొలకలపూడి చెందిన ఆపార్టీ నాయకులు షేక్ మాబాషా ఎంపికయ్యారు. వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు గొట్టికాటి రవీంద్రారెడ్డి ముఖ్య అనుచరుడుగా, పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన మాబాషా మండల కార్యదర్శిగా ఎంపిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ పదవి కట్టబెట్టిన స్థానిక సంస్థలు ఎమ్మెల్సీ, గూడూరునియోజకవర్గ సమన్వయకర్త మేరుగ మురళీ ధర్, మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కార్య దర్శి కామిరెడ్డి కస్తూరిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ పటిష్టతకు కష్టపడి పనిచేస్తానని మేజర్‌న్యూస్‌కు తెలిపారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** నేత్రదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని లయన్స్ క్లబ్ సభ్యులు, ఆప్తమాలజిస్టు రహమత్ అలీ ఖాన్ తెలిపారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్క రించుకుని ఆదివారం పట్టణంలోని బిఎంఎస్ క్లబ్ నందు నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పిం చారు. ఇందులో భాగంగానే కరపత్రాలను ఆవిష్క రించారు. నేత్రదానం చేయడానికి వయసుకు పరిమితులు లేదని. ఒకరు రెండు కళ్ళు దానం చేయడం ద్వారా ఇద్దరికి కంటి చూపు ఇచ్చిన వాళ్ళవుతారని ఆయన అన్నారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు కె.బాల సుబ్రహ్మణ్యం, అమరావతి సురేష్, త్రిమూర్తి రెడ్డి, రజి అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



## నేటితో ముగియనున్న డిగ్రీ కోర్సులకు దరఖాస్తులు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** డిగ్రీ కోర్సులకు దరఖాస్తుల రిజిస్ట్రేషన్ గడువు సోమవారంతో ముగియనుంది. ఈ మేరకు ఇప్పటికే ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఆప్షన్ ఎంపికకు వెసులబాటు కల్పిస్తూ, 7వ తేదీన ఆప్షనల్ మార్పు, 8వ తేదీన సీట్ల కేటాయింపు జరగనుంది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ కళాశాలలో ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయా కళాశాలల యాజమాన్యాలు తెలియజేశాయి.

## జిల్లా స్థాయిలో కీర్తి కిరణ్ రెడ్డికి కీలక పదవి

**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** మండలంలోని పాలచుర గ్రామానికి చెందిన మాజీ ఎన్.డీ.సి.సి.బి డైరెక్టర్ మద్దాల సోమశేఖర్ రెడ్డి తనయుడు మద్దాల కీర్తి కిరణ్ రెడ్డికి ఉమ్మడి నెల్లూరు జిల్లాలో జిల్లా స్థాయిలో కీలక పదవి లభించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ నెల్లూరు జిల్లా కార్యనిర్వాహక సభ్యులుగా మద్దాల కీర్తికిరణ్ రెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యా యం ఒక ప్రకటనలో తెలిపింది. ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డిని నెల్లూరులోని అయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి అయన ను శాలువాతో సత్కరించి పూలబొకే అందించారు. తన నియమానికి కృషి చేసిన సూళ్లూరు పేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డికి అయన హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియచేసారు.



## భూ తగాదాల్లో కత్తితో దాడి.. మహిళకు గాయాలు

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** నియోజకవర్గంలోని సోమల మండలం 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీ శీలంవారి పల్లి గ్రామానికి చెందిన శెట్టి బాలచంద్ర భార్య శశికళ(45) ఇంటి ప్రక్కన ఉన్న తమ భూమిలో మొక్కలు తొలగి స్తుండగా శెట్టి సుబ్రహ్మణ్యం, ద్వీప, మనోహర, చంద్రమ్మ తమ మీద దాడి చేసి గాయపరిచా రని గాయపడిన శశికళను సోమల ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రి సిబ్బంది సదుం ఆస్పత్రి కి రెఫర్ చేశారు. ప్రథమ చికిత్సానంతరం మెరుగైన వైద్యం కోసం డాక్టర్ల సలహా మేరకు పుంగనూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.



## మాజీ ఉపరాష్ట్రపతి పర్యటనపై డీఎస్పీ పరిశీలన

**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన పెళ్లకూరులో ఉన్న చాగణం లలితమ్మ భాస్కర్ రావు మెమోరియల్ ట్రస్ట్‌ను నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు పరిశీలించారు. ట్రస్ట్‌లో పలు కార్యక్రమాల శంకుస్థాపనకు ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పర్యటనపై వారు ఆరా తీశారు. పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ట్రస్ట్ సిబ్బందికి తెలియచేసారు. ఈపర్యటనలో దాదాపు 50 నుండి 100మంది పోలీసుల చేత పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. వారి వెంట నాయుడుపేట రూరల్ ఇన్స్పెక్టర్ సంఘమేశ్వర్ రావు, స్థానిక ఎస్సై కె.నాగరాజు ఉన్నారు.



## జిల్లా టెన్నికాయిట్ ఎంపికలు

**గూడూరు, మేజర్‌న్యూస్:** జిల్లా స్థాయి టెన్నికాయిట్ జట్ల ఎంపిక చేసినట్లు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం నాయుడుపేట జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల నందు తిరుపతి జిల్లా జూనియర్, సీనియర్ బాలబాలికల టెన్నికాయిట్ జిల్లాజట్ల ఎంపికలు జరిగినట్లు తెలిపారు. జిల్లాలోని పలు విద్యాసంస్థల నుండి 50మంది బాల బాలికలు ఈ ఎంపికలో పాల్గొన్నారు. ఈ ఎంపికలు జిల్లా టెన్నికాయిట్ అసోసి యేషన్ అధ్యక్షులు డాక్టర్ బండి శ్యాంసుందరరావు(మయూరి శ్యామ్ యాదవ్) సెక్రటరీ గెరిటి చెంచయ్య, ఉపాధ్యక్షులు పైడి కోటేశ్వర రావు, కె.మల్లికార్జున, ఈసి మెంబెర్స్ చాటమునిరాజ, అరుణకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపిక కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని యన్ మంజుల, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఎ.నాగూరయ్య, సెక్రటరీ బట్టా సుబ్రహ్మణ్యం, ప్రెసిడెంట్ ఎలెక్ట్ ఎన్.రామ్మోహన్ రావు, రొటేరియన్ యం. చంద్రశేఖర్, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## పసికూనల ప్రాణాలతో ఆటలా...!

### ప్రైవేటు విద్యాసంస్థలపై కొరవడిన నిఘా నిద్రావస్థలో జిల్లా విద్యాశాఖ

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల లో విద్యార్థుల పరిస్థితి దారుణంగా తయారైంది. 3 నుంచి 10వ తరగతి చదువుతూ అదే విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతిగృహాలలో మగ్గుతున్న విద్యార్థులు మానసిక రోగులవుతున్నారు. ఈ విషయం బహిరంగ సత్యమైనా జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకుండా నిద్రావస్థలో కొనసాగుతున్నారా? లేక లంచాల మాటున చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారో అర్థం కాలేదని మేధావి వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. జిల్లాలో సుమారు 400లకు పైగా ప్రైవేటు విద్యాసంస్థలలో పదుల సంఖ్యలో విద్యార్థులు మానసిక రోగులుగా మారి ఆసుపత్రుల పాలవుతున్నారు. తల్లిదండ్రులను సైతం ఆ విద్యాసంస్థలు మభ్యపెట్టి మీదే బాధ్యత అంటూ నెపం వారిపై నెట్టివేసి చోద్యం చూస్తున్నారు.

**నిఘా లోపమేనా ప్రధాన కారణం...** సెల్‌ఫోన్‌కు అడిక్ట్ కావడంతోనే ఈ పరిస్థితి నెలకొంది తల్లిదండ్రులను బెదిరించి చేతులు దులుపు కుంటున్నారు. ఇందులో భాగంగా తిరుపతి పరిసర ప్రాంతాలలోని చైతన్య, నారాయణతో పాటు పలు ప్రైవేటు సంస్థలలో చదువుతున్న విద్యార్థుల మానసిక ఒత్తిడికి గురై పలు రోగాలకు గురౌతున్నటులే విశ్వసనీయ సమాచారం. ఈ విషయంపై నెలకొమారు ఆకస్మిక తనిఖీ చేయాల్సిన జిల్లా అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శలు ఎదుర్కొంటున్నారు. నిఘా లోపంతోనే ప్రైవేటు విద్యాసంస్థలలో దారుణాలు చోటుచేసుకుంటున్నాయని విద్యావంతులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

## రేపు జనసేన అధినేత జన్మదిన వేడుకలు

### నాయీ బ్రాహ్మణులకు చీరలు, సెలూన్ కిట్ల పంపిణీ

### నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆవులు పాటి బుజ్జి బాబు

**తిరుపతి సిటీ, మేజర్‌న్యూస్:** రేపటి రోజు 2వ తేదీ మంగళవారం జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్క రించుకుని స్థానిక గాంధీ రోడ్డులోని ఏజికె బిల్డింగ్ నందు ఉదయం 10-30 గంటలకు తిరుపతి నగర నాయీబ్రాహ్మణ యువజన సేవాసంఘం ఆధ్వర్యం లో వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు జనసేన నాయకుడు, నాయీ బ్రాహ్మణసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆవులపాటి బుజ్జిబాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నాయీ బ్రాహ్మణులకు పంపిణీ చేయ బోయే సెలూన్ షాప్ కిట్‌ను 44వ వార్డు కార్పొరేటర్ శ్రీరాములుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం బుజ్జిబాబు మాట్లాడుతూ తమ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా నగరంలోని నాయి బ్రాహ్మణ కుటుంబాలలోని 500మంది మహిళలకు చీరలు, నాయి బ్రాహ్మణ సోదరు లకు రూ.700లు విలువగల సెలూన్‌షాప్ కిట్లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసు లు చేతులమీదుగా పంపిణీ చేస్తామన్నారు. అదేవిధంగా తిరుపతి నగర యువ జన సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరుగుతుందన్నారు. కావున నగరం లోని నాయీ బ్రాహ్మణులు అందరూ కార్యక్రమానికి విచ్చేసి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో మద్దిలేటి శీను, తాతారావు, ఆర్.ఇ.బాబు, నాగరాజు, లోకేష్, గోకుల్, మునిశేఖర్ పాల్గొన్నారు.



## వరసిద్ధి వినాయక నిమజ్జనం కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం

**రేణిగుంట, మేజర్‌న్యూస్:** రేణిగుంట అన్నదాన సత్రం వీధిలోని యూత్ ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, వైభవంగా మహాగణపతి హోమం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. మధ్యాహ్నం అన్నదానం, స్వామివారి లడ్డూ ప్రసాదం వేలంపాటలో రవి స్వామి వారి లడ్డూ ప్రసాదం సొంతం చేసుకున్నారు. తరువాత బాజా భజంత్రీలతో స్వామి వారి నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. రవి మాట్లాడుతూ స్వామి వారి ప్రసాదం సొంతం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్నదానసత్రం వీధి యూత్ సాయి చందు, జితేంద్ర, వంశీ, శ్యాము, ఓంకార్, సాయిరాహుల్ నవీన్, నాగరాజు, ఉమేష్, నాగేంద్ర పాల్గొన్నారు.



## ఏఎంసీ డైరెక్టర్‌గా సౌమ్య నియామకం

**ఓజిలి, మేజర్‌న్యూస్:** ఓజిలి మండల గుర్రం కొండ గ్రామానికి చెందిన తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు కొండూరు సురేష్‌రాజు సతీమణి కొండూరు సౌమ్యను నాయుడుపేట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్‌గా ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన ఆ ఏఎంసీ డైరెక్టర్ కొండూరు సౌమ్య మాట్లాడు తూ రైతులకు నాయుడుపేట వ్యవ సాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మెరు గైన సేవలందిస్తామని వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొండూరు సౌమ్య స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడ్డ వారి కి పదవులు దక్కడం ఖాయమని వారు సంతోషం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ అధిష్టానం నా మీద నమ్మకంతో మా సేవల కు గుర్తించి మా మీద నమ్మకంతో ఏఎంసీ డైరెక్టర్గా నన్ను నియమించినందుకుగాను సీఎం నారా చంద్రబాబు నాయుడుకి, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కి, ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీకి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంకి రుణపడి ఉంటానని కృతజ్ఞతలు తెలియజేశారు. రైతులకు సేవ చేసినందుకు కూటమి ప్రభుత్వం బాధ్యత గల పదవిని అప్పగించిందని వారి కోసం ఎల్లవేళలా కృషి చేస్తానని రైతులకు అన్ని విధాల సహకారం అందిస్తానని క్షేత్ర స్థాయి లో రైతులతో ప్రజలతో మమేకమవుతామన్నా రు. నాకు ఈ అవకాశం కల్పించిన సులూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ సూళ్లూరుపేట నియోజకవర్గం ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మ ణ్యంకి, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రత్యేక కృతజ్ఞతలు నాపై నమ్మకంతో నాకు ఈ పదవిని అందించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.



## నాగమల్లి దుర్గాప్రసాద్ అన్నదాన కార్యక్రమాలు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణంలో వినాయక చవితి పండుగ సందర్భంగా ఐదవ రోజు సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణం లో పలు వార్డులలో వినాయక మండపాల్లో అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలుగుదేశంనేత, మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గా ప్రసాద్, నాయకులు వినయ్‌కుమార్, సాయి, యశ్వంత్ పాల్గొన్నారు.



## వరసిద్ధి వినాయక స్వామి సన్నిధిలో పూజ

**కార్వేటినగరం (మేజర్‌న్యూస్):** కార్వేటినగరం మేజర్ పంచాయతీ తూర్పు వీధిలో ఉన్న వరసిద్ధి వినాయక స్వామి ఆదివారం ఉదయం అల్లాల వెంకట రాజు కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం తులసీరామ్ వారి కుటుంబ సభ్యులందరూ పూజా కార్యక్రమం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి వార్తల వెంకట రామయ్య వారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో పూజ లక్ష్మమ్మ, ఇషిక సాయి వారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యం లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వినాయక చవితి యువజన సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు... యువకుడుకి గాయాలు

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితుని కథనం మేరకు వివరాల్లోకి వెళ్తే మండల పరిధిలోని ఎంసీపల్లి పంచాయతీ ఎంసీ కొత్తూరు గ్రామానికి చెందిన నరసింహులు కుమారుడు గణేష్(20) పుంగనూరు నుండి ద్విచక్ర వాహనంలో ఎంసీ కొత్తూరుకు వెళుతుండగా మార్గమధ్యంలో మదనపల్లి రోడ్‌లోని ఫ్రెండ్స్ డాబా దగ్గర కారు ద్విచక్ర వాహనానికి అడ్డంగా తిప్పగా ద్విచక్ర వాహనం బోల్తాపడి తనకు గాయాలయ్యాయి గమనించిన స్థానికులు హుటాహుటిన ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ తరలించారన్నారు.



## భక్తుల కోలాహలం నడుమ నిమజ్జనానికి గణనాథులు



**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** భక్తులకోలాహలం నడుమ నిమజ్జనానికి గణనాథులు రాయల్‌చెరువుకు తరలుతున్నారు. ఆదివారం 5రోజులు పూజలందుకున్న వినాయక విగ్రహాలును యువత గ్రామ వీధుల్లో బానిసంచ పేల్చుతూ ఊరేగింపుగా రాయల్ చెరువుకు తరలించారు. ఈ క్రమంలోనే యువత డప్పులు వాయించుకుంటూ ఉర్రూతలూగుతూ రాయల చెరువు లో నిమజ్జనం చేశారు. ఈ నిమజ్జన ఉత్సవానికి ఆర్‌సి.పురం పోలీసులు ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మండలంలో వినాయక స్వామి సంబరాలు

**ఏర్పేడు, మేజర్‌న్యూస్:** వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా ఏర్పేడు మండలం రాజుల కండ్రిగ గ్రామంలో శనివారం వినాయక స్వామి లడ్డు వేలం నిర్వహించారు. స్వామి లడ్డును 68 వేల రూపాయలకు పర్వతాల మునిరాజు, గీతదంపతులు వేలంలో దక్కించుకున్నారు. తర్వాత వినాయకుని రూపాయి బిళ్ళను దివ్య, కరుణాకర్ దంపతులు రూ.46వేలకు దక్కించుకున్నారు. నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో భాగంగా భార్గవి, వెంకటేష్ దంపతులు దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్వామికి పలుకూరి మణి రాజు, నీలావతి దంపతులు లడ్డుని ప్రసాదంగా సమర్పించారు. యువకులకు అనేక క్రీడలు పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ చెంగల్ రాజు, మురళిరాజు, వెంకటాచలం, జనార్దన్ రాజు, మల్లికార్జున్ రాజు, మునిభాస్కర్, వినాయక యూత్ సభ్యులు పాల్గొన్నారు.



## పీఏసీఎస్ నూతన అధ్యక్షులుగా కేవీ

**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** మండలంలో రైతుల సంక్షేమం కోసం చిల్లకూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా అవిరల కృషి చేస్తానని కేవీ నాయుడు తెలిపారు. రైతులు మనుగడ కోసం ప్రభుత్వం కల్పించే రైతు సంక్షేమ పథకాలు అన్నింటిని రైతులకు చేరే విధంగా కృషి చేస్తానని నూతన అధ్యక్షులుగా ఎంపికైన పెళ్లకూరు మండలం రావులపాడు గ్రామానికి చెందిన కొచర్ల వెంకటరమణయ్యనాయుడు (కేవీ నాయుడు) స్పష్టం చేశారు.



తనను ఎంపిక చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. సభ్యులుగా కానూరుకి చెందిన పెళ్లకూరు గోపాలకృష్ణ, పాలచ్చూరుకి చెందిన ఎద్దల రామకృష్ణారెడ్డి ఎంపికైన వారిలో ఉన్నారు.

# టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభం

**గూడూరు, మేజర్‌న్యూస్:** అల్లూరు ఆదిశేషా రెడ్డి ప్రభుత్వ స్టేడియం" నందు లిఆగస్టు 31 నుండి సెప్టెంబర్ 3 వ తేదీ వరకు నిర్వహించు టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ ప్రారంభించారు. ఆదివారం ప్రారంభోత్సవవానికి 20 మండలాల కెప్టన్లు (ఉపాధ్యాయులు) క్రీడాకారులు హాజరైనారు. మొదటి మ్యాచ్ ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ ప్రారంభించారు. ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థల లో ప్రగతి సేవా సంస్థది ప్రత్యేక శైలి అని కడుపేదలను గుర్తించి వారి అవసరాలను తీర్చడం మాత్రమే కాక వివిధ సందర్భాలలో వివిధ రంగాలలో ప్రాముఖ్యత కలిగిన వ్యక్తులను సన్మానించి ప్రోత్సహిస్తుందన్నారు. ప్రతి ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా టీచర్ల లో ఉన్న క్రీడా ప్రతిభని ప్రోత్సహించడానికి రాష్ట్ర స్థాయి టీచర్స్ క్రికెట్ లీగ్‌ను నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. నేను కూడా ప్రగతి సేవా సంస్థ సభ్యుడినని చెప్పుకోవడానికి గర్వపడుతున్నానని తెలియజేశారు. అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ సేవే లక్ష్యం సేవే పరమార్థం అన్న తమ సంస్థ యొక్క ఉద్దేశాన్ని అర్థం చేసుకొని ముందుకు నడిపిస్తున్న దాతలందరికి ధన్యవాదాలు తెలియజేశారు. నిత్యం విద్యా బోధనలో నిమగ్నమైన టీచర్లకు ఆటవిడుపుగా ఈ టీచర్స్ క్రికెట్ లీగ్ నిర్వహించడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ కోఆర్డినేటర్ పిడి కరిముల్లా, తెలుగుదేశం నాయకులు పట్టాభి రెడ్డి, కరుణాకర్ రెడ్డి, మస్తాన్ నాయుడు ప్రగతి సేవా సంస్థ ఉపాధ్యక్షుడు బండి ధనుంజయ రెడ్డి ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు కరుణాకర్ రెడ్డి, మస్తాన్ నాయుడు, పిల్లెళ్ల శ్రీనివాస్, తెలుగుదేశం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## కోలాహలంగా వినాయకుడి నిమజ్జనం

**చౌడపల్లిరూరల్, మేజర్‌న్యూస్:** మండలంలోని శెట్టిపేట పంచాయతీ



మేకలచిన్నపల్లి గ్రామంలో వినాయక చవితి సందర్భంగా మూడు రోజులపాటు వినాయకునికి వివిధ రంగుల పుష్పాలతో అలంకరణ గావించారు. ప్రతిరోజు ఉదయం ప్రధాన అర్చకులైన చిన్ని స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, పూజలు గ్రామ ప్రజల సమక్షంలో నిర్వహించారు. నిన్నటి దినం అనగా శనివారం రాత్రి హస్తకళలకు పేరుగాంచిన కోలాటలు చెక్కభజనలో మొదలగు కార్యక్రమాలలో గ్రామ ప్రజలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పండగ సందర్భంగా మేకలచినపల్లి గ్రామంకు వినాయకుని విగ్రహ దాత ఎంఎస్ జతిన్ ఇన్ఫ్రా కంపెనీ వారు అందజేయడం జరిగింది. అదేవిధంగా స్వామివారికి వెండి నాణెం ను నక్కల మునివెంకటరెడ్డి కుటుంబ సభ్యులు మరియు స్వామివారి ప్రసాదం లడ్డును కొండూరు గంగరాజు ఫ్యామిలీ సమర్పించడం జరిగింది. అంతేకాకుండా వినాయకుని లడ్డూ వేలంపాటలో సాతర్ల మనోహర్ రూ.40000 పైబడి పాడి దక్కించుకోవడం జరిగింది అదేవిధంగా వినాయకుని వెండి నాణెం ను నక్కల వినోద్‌కుమార్ రెడ్డి రూ.20వేలకు పైగా పాడి దక్కించుకోవడం జరిగింది. వీరందరికీ దుసాలవలతో గౌరవంగా సత్కరించడం జరిగింది.

## కోలా ఆనంద్ దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ దంపతులకు వివాహ వార్షికోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. కోలా ఆనంద్ దంపతులకు ఘనంగా సన్మానం చేయడం జరిగింది. కోలా ఆనంద్ దంపతులు ఇలాంటి పెళ్లిరోజు మరెన్నో జరుపుకోవాలని వాయులింగేశ్వరస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకోవడం దేవుని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సభ్యులు చొక్కాని రామ్మూర్తి, నాగలాపురం గోవర్ధన్, జిల్లా అధికార ప్రతినిధి కొండేటి గోపాల్, పట్టణ అధ్యక్షులు హరీష్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగా బత్తిని గోపాల్, మాజీ ప్రధాన కార్యదర్శి కోనేటి అయ్యప్ప, ప్రధాన కార్యదర్శులు చందు రాయల్, సిద్దు రాయల్, పట్టణ యువ మోర్చా అధ్యక్షులు తానికొండ్ల భరత్ కుమార్ నాయుడు, ఓబీసీ మోర్చా అధ్యక్షులు కన్నా వెంకటేశ్వర్లు, మోదుగుల నాగరాజు, యువమోర్చా సభ్యులు రవి రాయల్, చోటు, బిందు రాయల్, నానీ, శివా రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.



# సీఎం సార్.. ఉద్యోగ అవకాశం కల్పించి నన్ను ఆదుకోండి

### నాకు రెండు కాళ్ళు చచ్చుబడి రిక్షానే ఆధారం

**సూళ్లూరుపేట, మేజర్‌న్యూస్:** నేను నిరుపేద దళిత కుటుంబానికి చెందిన నిరుద్యోగ వికలాంగుడనని నాపేరు మాల పాటి ప్రకాష్ మా తండ్రి అంకయ్య, తల్లి సుబ్బమ్మ. నిరుపేద కుటుంబం కూలినాలి. పనులు చేసుకుని జీవనంసాగించి మమ్మలను చదివించారు. తిరుపతి జిల్లా తుంగమడుగు గ్రామం, దొరవారిసత్రం మండలమని నేను ఎంఏ, బీఈడీ చదువుకున్నానని నాపై దయవుంచి సీఎం చంద్రబాబు నాయుడు, యువకులు విద్యావంతులు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, తమను, తన కుటుంబాన్ని ఆదుకోవాలని రెండు కాళ్ళు చచ్చుబడి 3 చక్రాల బండే పై అరకొర జీతంతో కుటుంబాన్ని నడిపిస్తున్న దివ్యాంగుడు ప్రకాష్ కోరుతూ కన్నీటి విజ్ఞాపన చేశారు. చాలా కష్టాల్లో ఉన్నాను. అధికారులు, ప్రజాప్రతినిధులు, చుట్టూ తిరిగి అలిసిపోయిన అంటూ కన్నీరుపెట్టుకున్నాడు దివ్యాంగుడు. నేటి దినపత్రిక సూర్యను ఆశ్రయించి కలిసి తన కష్టం తెలియజేశారు. కార్యాలయం, అధికారు లు, ప్రజాప్రతినిధులు వరకు ఎన్నిచోట్ల తిరిగినా నేను పేద వాడిని నాకు న్యాయం చేయాలని కాళ్ళు అరిగేలా తిరిగిన ఫలితం దక్కలేదు. చివరికి నేటి దినపత్రిక సూర్యకు చేరి తనకష్టాన్ని చెప్పుకున్నారు. దొరవారిసత్రం మండలం తుంగమడుగు గ్రామానికి చెందిన నేను పుట్టుకతోనే రెండు కాళ్ళు చచ్చుబడి 3 చక్రాల బండే ఆధారం ప్రస్తుతం నేను హెూలీక్రాస్ ప్రవేటు స్కూల్లో పాఠాలు చెబుతూ వచ్చే కొద్దిపాటి జీతంతో జీవనం సాగిస్తున్నానని నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారని తన ఆవేదన వ్యక్తం చేశారు. నేను బీఈడీ చదివి నాకు రావలసిన బ్యాక్ లాగ్ పోస్టులకోసం పలు ఇంటర్వ్యూలకు పోయిన నాకు ఉద్యోగ అవకాశం దక్కడం లేదని కన్నీరు మున్నీరయ్యాడు ఇప్పటికైనా సీఎం సార్ నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు నా పేదరికం ఆలోచించి మా కుటుంబానికి అండగా నిలవాలని నాకు ఏదైనా ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించి నా .. కుటుంబానికి అండగా నిలవాలని వేడుకున్నారు.







# బంగారు పెద్దశేష వాహనంపై వరసిద్ధుడు

**ఐరాల, మేజర్‌న్యూస్:** కాణిపాకం స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానంలో ఈనెల 27 వతేది బుధవారం నుంచి అత్యంత వైభవంగా జరుగుతున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి వివిధ రకాల విద్యుత్ దీపాలతో వివిధ రకాల పరిమిళ పుష్పలతో అలంకరించిన బంగారు పెద్ద శేష వాహనం పై ఊరేగుతూ భక్తులను అలరించారు.



ఈమేరకు ఆలయ వరుస ఉభయదార్లు అయిన కాణిపాకం, కాకర్లవారిపల్లి, వడ్రాంపల్లి, మిట్ట ఇండ్లు, కొత్తపల్లి, అడపగుండ్ల పల్లి,44 బొమ్మసముద్రం, తిమ్మోజి పల్లి తిరువణంపల్లి, చిగరపల్లి, అగరంపల్లి, వంటి గ్రామాలకు చెందిన కమ్మ వంశస్థులు ఉదయం స్వామివారి మూలవిరాట్ కు వివిద రకాల పరిమిళ సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు పంచామృతం పంచిపెట్టారు. ఈసందర్బంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం రాత్రి వివిధారకాల పరిమిళ పుష్పాలతో,రంగు రంగుల విద్యుత్ దీపాలతో దేదివ్య మానంగా అలంకరించిన బంగారు పెద్ద శేష వాహనం పై సిద్ధి బుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి ఉత్సవ మూర్తులను ఉంచి కాణిపాకం గ్రామ పురవీధులు గుండా బాణసంచా లు పేలుస్తూ మంగళ వాయిద్యాలు నడుమ ఘనంగా ఊరేగుంచారు. అలాగే ఆలయ ఉభయదార్లు గ్రామోత్సవంలో కళాశాలను తీసుకొచ్చి స్వామివారి కళ్యాణో త్సవంలో పాల్గొన్నారు. ఆలయ ఈవో పెంచల కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ఆలయ ఎఇఓ లు రవీంద్ర బాబు, ఎస్వీ కృష్ణా రెడ్డి, హరిమాధవ రెడ్డి,ప్రసాద్,ధనపాల్, సూపర్ డెంట్లు,కోదండపాణి,వాసు,ప్రధాన అర్చకులు యన్. సోమశేఖర్, సహాయ అర్చకులు గణేష్ గురుకుల్,రాఘవేంద్ర ,ధర్మే శ్వర్ గురుకుల్, ఉన్నికృష్ణ,రవి, లతోపాటు వేదపండితులు బంగారు పెద్దశేష వాహన ఉభయదార్లు వివిధ సూధురా ప్రాంతాల నుంచి తరలి వచ్చిన పలువురు భక్తులు పాల్గొన్నారు.

## టీటీడీకి భారీ విరాళం



**తిరుమల, మేజర్ న్యూస్:** హైదరాబాద్ కు చెందిన ఆర్.ఎస్.బి రీటైల్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఆదివారం టీటీడీ బర్డ్ ట్రస్టుకు రూ.2,92,91,840 (రూ.2.93 కోట్లు) ను విరాళంగా అందించింది. అదేవిధంగా ఆర్.ఎస్.బ్రదర్స్ జ్యూవెలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ టీటీడీ బర్డ్ ట్రస్ట్ కు రూ.1.10 కోట్లు విరాళంగా అందించింది. ఈ మేరకు ఆ సంస్థల ఎండీలు పొట్టి వెంకటేశ్వర్లు, సీర్న రాజమౌళి, టి.ప్రసాదరావు, పొట్టి మాలతి లక్ష్మీ కుమారిలు శ్రీవారి ఆలయంలోని రంగనాయకులు మండపంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, అదనపు ఈవో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బై బై గణేశా... పలు గ్రామాల్లో వినాయకుని నిమజ్జనం



**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వినాయకుని నిమజ్జన కార్యక్రమాలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. వినాయకుని ప్రతిమ ఎదుట ఏర్పాటు చేసిన ఉట్లో త్సవాన్ని యువకులు అత్యంత ఉత్సాహంతో జరుపుకున్నారు. ఒకరికొకరు రంగులు పూసుకుని జై జై గణేశా.. బై బై గణేశా అంటూ పురవీధుల గుండా వినాయకునుని ఊరేగించారు. వినాయక స్వామికి హారతులు ఇచ్చి తమ భక్తిని చాటుకున్నారు. పలు గ్రామాల్లో కోలాటాలు, డీజే లతో వినాయకునుని ఊరేగిస్తూ లోతైన చెరువులు వద్దకు తీసుకుని వెళ్లి నిమజ్జనం చేశారు.

## ఘనంగా వినాయక విగ్రహాల నిమజ్జనం

**రొంపిచెర్ల, మేజర్ న్యూస్:** వినాయక చవితి పండగలో భాగంగా మండలంలో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక స్వామి విగ్రహాలను బ్యాండ్ మేళాలతో ఊరేగించి చెరువులో ఆదివారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ప్రజలు, మహిళలు, యువతీ, యువకుల రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ సంబరాలు చేశారు. బాణా సంచాలు కాల్చి పురవీధులలో ఊరేగించారు. బజారు వీధి, బలిజ వీధి, పాలెం వీధి, శ్రీరాములు గుడి వీధి, ముత్యాలమ్మ గుడి వీధి, రామచంద్రాపురం కాలనీ, గానుగచింత గ్రామాల్లోని విగ్రహాలను నిమర్జనం చేశారు. భక్తులు విగ్రహాల వద్ద టెంకాయలు కొట్టి మక్కులు తీర్చుకున్నారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



## వినాయక నిమజ్జన వేడుకల్లో కమిషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్ :** వినాయక నిమజ్జన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. నగరపాలక సంస్థలో ఏర్పాటు చేసిన వినాయకుడికి మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ ఎన్.మౌర్య ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం వినాయక సాగర్ వరకు ర్యాలీ గా వినాయక సాగర్ కు చేరుకుని నిమజ్జనం చేశారు.



నగరపాలక సంస్థ నుండి విగ్రహా ఊరేగింపులో ఉద్యోగులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య, ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ నగరపాలక ఆధ్వర్యంలో, పోలీస్, తుడా, ఫైర్, తదితర విభాగాల ఆధ్వర్యంలో వినాయక సాగర్ లో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేశామని అన్నారు. నిమజ్జనకు వచ్చేవారు కూడా చాలా జాగ్రత్తగా వచ్చి నిమజ్జనం చేయాలని అన్నారు. నలుమూలలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, అందరూ జాగ్రత్తగా ఉండాలని అన్నారు.



# వారి సేవలు అమూల్యం..

### ఎపీఎస్పీడీసీఎల్ సిఎండి కె.సంతోష రావు

**తిరుపతి సిటీ,మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) పరిధిలో వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తూ పదవీ విరమణ పొందుతున్న చీఫ్ జనరల్ మేనేజర్లు డిఎస్ వరకుమార్, కెఆర్ఎస్.ధర్మజ్ఞాని, జనరల్ మేనేజర్ పి.మురళిల సేవలు ఎనలేనివని ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష రావు అన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సిఎండి కె.సంతోష రావు మాట్లాడుతూ ఏపీఎస్పీడీసీఎల్‌లో వివిధ హోదాల్లో వారు వినియోగదారులకు అందించిన సేవలను కొనియాడారు.సత్యవేడు నియోజకవర్గ శాసనసభ్యులు కె.ఆదిమూలం,ఏపీఎస్పీడీసీఎల్ మాజీ సీఎండి కలాల రంగనాథం,డైరెక్టర్లు కే. గురవయ్య, పి.అయూబ్ ఖాన్ తదితరులు మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తూ సంస్థ అభివృద్ధికి వారు తమ వంతు సహకారాన్ని అందించారని కొనియాడారు. అనంతరం పదవీ విరమణ పొందిన అధికారులు మాట్లాడుతూ ఏపీఎస్పీడీసీఎల్ లో వివిధ హోదాల్లో విధుల నిర్వహణలో తమకు సహకరించిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారిని సంస్థ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్చాలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణా దేవి, పిహెచ్ జానకిరామ్, కె.రామ్మోహన్ రావు,మాజీ సీజీఎం ఫైనాన్స్ వై.లక్ష్మీ నరసయ్య, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె. జనార్ధన్ నాయుడు,ఏఎస్పి రవి మనోహరాచారి,జనరల్ మేనేజర్లు ఎం. కృష్ణా రెడ్డి, శ్రీనివాస రావు, రామచంద్ర రావు,రమేష్,సురేంద్ర రావు, మురళీ కుమార్, ప్రసాద్, వెంకటరాజు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు రమణ, విజయన్, సురేంద్ర నాయుడు, ఇస్మాయిల్ అహ్మద్, శేషాద్రి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



# రామాపురం గ్రామంలో జనసురక్ష కార్యక్రమం



**తడ మేజర్ న్యూస్:** తడ కెనరా బ్యాంక్ బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో తడ మండలం రామాపురం గ్రామంలో ఆదివారం జన సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు పీఎం జే డి వై అకౌంట్ కలిగి ఉండాలని అలాగే అకౌంట్ కలిగిన ప్రతి ఒక్కరు ప్రభుత్వం ద్వారా బ్యాంకుల్లో అందుబాటులో ఉన్నటువంటి ఇన్సూరెన్స్ పథకాలు పీఎం జేజే బి వై, మరియు పీఎం ఎస్ బి వై, ఏపీ వై, పథకాల గురించి కూడా అందరూ తెలుసుకొని వినియోగించుకోవాలని కెనరా బ్యాంక్ ప్రతినిధులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఎల్ డి ఎం రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అకౌంట్ చేసుకొని అకౌంట్ చేసుకున్న వారందరూ కూడా పీఎం జేజేబి వై, పి ఎం ఎస్ బి వై పథకాలు నమోదు చేసుకోవాలని అదేవిధంగా 10 సంవత్సరాలకు ఒకసారి రికేవైసీ వాటిని చేసుకొని వారి యొక్క అకౌంట్లోనే జాగ్రత్తగా ఉంచుకోవాలని తెలియజేశారు. కెనరా బ్యాంక్ హెడ్ ఆఫీస్ బెంగళూరు జనరల్ మేనేజర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకులో ఉన్నటువంటి సేవలను తెలుసుకొని వాటి యొక్క ప్రాముఖ్యతను అందరూ ఉపయోగించుకోవాలని తెలియజేశారు అదే విధంగా తిరుపతి రీజినల్ ఆఫీస్ డెప్యూటీ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులో ఉన్నటువంటి అకౌంట్లకు ఎలాంటి మోసపూరితమైన మోసాలు మరియు సైబర్ నేరాలకు గురించి అవగాహన కల్పించారు. డీజీఎం, డిఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూడా సైబర్ నేరాలు పట్ల అప్రమత్తమై ఉండి వారి యొక్క ఖాతాల నుండి ఎలాంటి మోసాలు జరగకుండా చూసుకోవాలని ఎవరికీ ఓటీపీ వివరాలు తెలియజేయకుండా ఉండాలని తెలిపినారు. అలాగే తడ కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంక్ అకౌంటులకు రీకేవైసీ చేసుకోవాలి అదేవిధంగా ఇన్సూరెన్స్ మరియు పెన్షన్ పథకాలు కూడా చేసుకొని వారి యొక్క ముందస్తు జాగ్రత్తల కోసం తగిన విధంగా మీరు బ్యాంకుల్ని ఉపయోగించుకోగలరని తెలియజేసినా రు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి జిల్లా ఎల్డిఎం రవికుమార్ కెనరా బ్యాంక్ బెంగళూరు హెడ్ ఆఫీస్ జనరల్ మేనేజర్ చక్రవర్తి, తిరుపతి సర్కిల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ పాండురంగ మితంతయ, తిరుపతి కెనరా బ్యాంక్ రీజనల్ ఆఫీస్ డీజీఎం రామ మోహన్, మరియు తిరుపతి రీజినల్ ఆఫీస్ డిఎం, తడ కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్, శ్రీ సిటీ కెనరా బ్యాంక్ మేనేజర్ మరియు కెనరా బ్యాంక్ స్టాఫ్ ఎస్ ఎస్ టి ఆర్గనైజేషన్ సిఎఫ్ఎల్ కౌన్సిలర్స్ , రామాపురం క్లస్టర్ ఈ ఓ ఏ లు పాల్గొన్నారు.

### నిమజ్జనానికి తరలుతున్న
# వినాయకులు



**పలమనేరు మేజర్ న్యూస్** పలమనేరు పట్టణంలోని పాతపేట శ్రీనగర్ కాలనీలో ఉన్న వినాయక స్వామిని నిమజ్జనానికి ట్రాక్టర్ పై ర్యాలీగా నిర్వహించారు. వినాయక స్వామిని పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో ఆటపాటలతో స్వామి వారిని తీసుకువెళ్లారు. వినాయక స్వామిని చూడడానికి పట్టణ ప్రజలు తరలి వచ్చారు. అక్కడ ఏర్పాట్లను డిష్ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి ప్రసాద్, మోహన, గోపి, ప్రసాద్, అనిల్ యాదవ్,రాజు, యస్వంత్, జ్యోతి రెడ్డి, వాసిక్తో, మౌళి, పాటు అతని స్నేహితులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక నిమజ్జనం

**శ్రీకాళహస్తి అర్బన్, మేజర్ న్యూస్ :** శ్రీకాళహస్తి పట్టణం, మండల పరిధిలోని పలుచోట్ల ఆదివారం వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఐదు రోజులు పాటు పూజలు అందుకున్న వినాయకుని ఆదివారం నిమజ్జనానికి సాగనంపారు. ఈ సందర్భంగా ఊరేగింపు ఉత్సవాల్లో వినాయక కమిటీలు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున డప్పులు, నృత్యాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో షిరిడి సాయి వీధిలో భారీ విగ్రహానికి నిమధన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఊరేగింపులో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణ శివారులోని చెరువులో స్వామివారి నిమజ్జనాన్ని నిర్వహించారు.



## ఆదిభట్ల నారాయణదాస విగ్రహానికి ఘనంగా పుష్పాంజలి



**తిరుపతి బ్యూరో,మేజర్ న్యూస్ :** హరికథా పితామహునిగా పేరున్న అజ్జాడ ఆదిభట్ల నారాయణదాస 160వ జయంతిని పురస్కరించుకుని తిరుపతిలోని టిటిడి శ్రీ వేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల ప్రాంగణంలో ఆయన విగ్రహానికి ఆదివారం ఉదయం కళాశాల ప్రిన్సిపాల్ డా. ఉమా. ముద్దుబాల, డిపిపి సెక్రటరీ శ్రీరామ్ రఘునాథ్ లు ఘనంగా పుష్పాంజలి సమర్పించారు. అనంతరం కళాశాల విద్యార్థులు బృందగానం నిర్వహించారు. ఎస్వీ మ్యూజిక్ కళాశాల నుండి ఊరేగింపుగా మహతి ఆడిటోరియం చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు డిపిపి కళాకారులు పాల్గొన్నారు.

## స్మార్ట్ కార్డు కలిగి ఉన్న కుటుంబీకులకు పంపిణీ



**పలమనేరు మేజర్ న్యూస్** పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని పాత పేటలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను రేషన్ షాపుల వద్ద పట్టణ కార్యదర్శి గిరి, కౌన్సిలర్ నాగరాజు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. స్మార్ట్ కార్డుల వినియోగంవల్ల రేషన్ షాపుల వద్ద గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి ఉండదని ఈ సందర్భంగా వారు తెలిపారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన సెకండ్ల వ్యవధిలోనే కార్డుదారుల వివరాలు రేషన్ డీలర్లకు చూపిస్తుంది. నిత్యవసర సరుకులు వెంటనే తీసుకునేందుకు వీలవుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని స్మార్ట్ రేషన్ కార్డ్ కలిగిన వారు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బోగస్ వైసీపీ నాయకుల మాటలు విని తప్పుదోవ పట్టకుండా అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సునీత నాగరాజ్, గిరి, చిన్ని, డిష్ శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## రైల్వే కాలనీలో ఘనంగా ఉట్లోత్సవం

**తిరుపతి క్రైమ్, మేజర్ న్యూస్:** తిరుపతి నగరంలోని 34 డివిజన్ రైల్వే కాలనీలో రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదివారం చివరి రోజున వినాయక చవితి విగ్రహానికి రైల్వే కాలనీలో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సింగంశెట్టి సుబ్బరామయ్య నేతృత్వంలో రైల్వే కాలనీ యువత, చిన్నారులు మహిళలు ఉట్లోత్సవం లో పాల్గొన్నారు. ఉట్టి కొట్టిన వారికి సుబ్బరామయ్య బహుమతులను అందజేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం వినాయక విగ్రహాన్ని వినాయక సాగర్ లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గుండాల గోపీనాథ్ రెడ్డి, నైనర్ జగదీష్, జంగం ముని సుబ్రహ్మణ్యం, జగదీష్,సురేంద్ర రాజు రైల్వే కాలనీ వాసులు పాల్గొన్నారు.



## వినాయక నిమజ్జనానికి అతిథులుగా ఇద్దరు సిఐలు

**శ్రీకాళహస్తి రూరల్, మేజర్‌న్యూస్ :** శ్రీకాళహస్తి మండలం చుక్కల నిడిగల్లులో ఈనెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వినాయక చవితి ఉత్సవాలను రోజుకొక నైవేద్యంతో వినాయకునికి పూజలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమానికి అతిథులుగా రెండవ పట్టణ సీఐ నాగార్జున రెడ్డి, ఒకటవ పట్టణ, శ్రీకాళహస్తి రూరల్ సిఐ గోపి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఆధ్యాత్మిక వాతావరణంలో వినాయక సంబరాలు ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అతిథులుగా చుక్కల నిడిగల్లు చుక్కల పవన్ కుమార్ ఖుషి ,నవీన్, భరత్,వినయ్,కార్తీక్, సిద్ధు,సునీల్ ,రేవంత్,హరీష్, చరణ్ ,ప్రేమ్,మనోజ్,పవన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# రాయలసీమ అభివృద్ధి ప్రదాత చంద్రబాబునాయుడు

## శ్రీకాళహస్తి పట్టణ తెదేపా అధ్యక్షుడు. జి. విజయకుమార్



**శ్రీకాళహస్తి మేజర్ న్యూస్ ,** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్ని వర్గాల ప్రజలకు వారి సంక్షేమానకి సంక్షేమ పథకాలు అమలకు ఆరాధ్య దైవం అని శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షులు జి విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి నంద మూరి తారక రామారావు సాగు నీటికి, తాగునీటికి ప్రాధాన్యత ఇస్తూ, రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు, లిఫ్ట్ ఇరిగేషన్లు నిర్మించి ఆంధ్ర రాష్ట్రాన్ని సస్య శ్యామలం చేసారని ఆయన వేసిన భాటలో నేడు రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు పయనిస్తున్నారని తెలిపారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను కడపలోని పులివెందులకు, చిత్తూరు జిల్లాకు సాగునీరు, తాగునీరు అందించిన రైతు బాంధవుడు చంద్రబాబు నాయుడు అని తెలిపారు. 2024 లో కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ 15 నెలలు కాలంలో 3890 కోట్లు కేటాయించి రాయలసీమని రత్నాలు సీమ చేయడానికి యుద్ధ ప్రతిపాదకన, హంద్రీనీవా ప్రాజెక్టు పనులు పూర్తిచేసి ఆంధ్ర రాష్ట్రానికి చివరి నియోజకవర్గమైన కుప్పంకు కృష్ణా జలాలని అందిస్తున్నారన్నారని తెలిపారు.

# సంతానానికి స్వయంభుడు - మహిమాన్వితుడు మల్లాం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి





### ప్రాచీన శిల్పకళలకు నిలయం.. పురాతన ఆధ్యాత్మిక క్షేత్రం

### రేపటి నుండి మల్లాం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

**చిట్టమూరు, మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లా,చిట్టమూరు మండలం, మల్లాంలో సంతానానికి స్వయంభుడు, శక్తి స్వరూపుడుగా వళ్ళీ, దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి స్వయంభువుగా విరాజల్లుతున్నారు. నిత్యం ధూప, దీప, నైవేద్యాలతో మహిమాన్వితుడై భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారమై అలరారుతున్నారు. ప్రసిద్ధికెక్కిన పురాతన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలలో ఒకటిగా, ప్రాచీనశిల్పకళా నైపుణ్యానికి ఈఆలయం ప్రసిద్ధి చెందింది. తారకాసుర రాక్షస సంహారనంతరం, మల్లాసుర, కొల్లాసుర యుద్ధంతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి స్వయంభు



గా ఇక్కడ వెలిసారని పురాణాల ద్వారా తెలుస్తోంది. 6 నుండి 11వ శతాబ్ద కాలంలో చోళులు, పాండ్యులు ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసి,నిత్య ధూప,దీప,నైవేద్యాలకు వంద ఎకరాలకు పైగా మాన్యాన్ని కేటాయించారు. దేవాలయ ప్రాంగణంలో శతస్తంభ కళ్యాణ మండపంలో భారత, భాగవత, రామాయణ, ప్రాచీన శిల్పకళా నైపుణ్యం ఉట్టిపడేలా చెక్కిన శిల్పాలు నేటికి చూపరులను కట్టిపడేస్తాయి.రథానిక ఆమర్చిన గుర్రాలుశతుస్తంభ కళ్యాణమండపానికి జీవం పోసేలా నేటికీ దర్శనమిస్తాయి. దేవాలయ ప్రాంగణంలో వినాయకుడు,కోమలేశ్వర స్వామి, నవగ్రహాలు,నాగేంద్ర స్వామి,ఆంజనేయ స్వామి, మార్కండేయ స్వామి, కాలభైరవుడు ఆలయాలు ఉన్నాయి. స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ధ్వజారోహణం రోజున కొడిముద్దను ప్రసాదంగా స్వీకరిస్తే సంతానం కలుగుతుందన్న నమ్మకంతో పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చి కొడిముద్దను ప్రసాదంగా స్వీకరిస్తారు.గ్రహ దోషాలు పోగోట్టి, సంతానం, సౌభాగ్యం,కళ్యాణ భాగ్యం కలిగించే స్వయంభువుడుగా పూజలందుకుంటున్నారు. ప్రతి మంగళ, శుక్ర,ఆదివారాల్లో స్వామి వారిని దర్శించుకునేందుకు వందలాదిగా సుదూర ప్రాంతాల నుండి భక్తులు తరలివస్తారు. ప్రస్తుతం ఆలయానికి ముందు కోనేరు నిర్మాణంఅసంపూర్తిగా ఉంది. మల్లాంను పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు పాలకుల హామీలు అమలు కావడం లేదు. ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దితే మల్లాం స్వయంభు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పుణ్యక్షేత్రంగా వెలుగొందే అవకాశం ఉంది. సుబ్రహ్మణ్యేశ్వర పుణ్య క్షేత్రాలలో స్వామి స్వయంభువుగా వెలసి,ఆరు అడుగుల మూలవిరాట్ కలిగిన మహిమాన్విత మల్లాం పుణ్యక్షేత్రాన్ని మరింత అభివృద్ధి పదాన తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.

**రేపటినుండి బ్రహ్మోత్సవాలు....** తిరుపతి జిల్లా, చిట్టమూరు మండలం, మల్లాంలోని వళ్ళీ, దేవసేనా సమేత స్వయంభువు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 2వ తేదీ మంగళవారం నుండి సెప్టెంబర్ 14వ తేదీ వరకు వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కామిరెడ్డి మునిశేఖర్ రెడ్డి తెలిపారు. 2వ తేదీ అంకురార్పణ, 3న ధ్వజారోహణం, 7న ఫలాభిషేకం, నందిసేవ, 8వతేదీ రథోత్సవం, 9న షణ్ముఖస్వామి కళ్యాణం,10న కల్యాణ రాయబారం, 11న కళ్యాణం, ముత్యాల తలంబ్రాలు, 12నవసంతోత్సవం, ధ్వజ అవరోహణ, 13న అలకలదోపు, 14న ఊంజల్ సేవ, ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. దేదీప్యమైన లైటింగ్ వెలుగుల కాంతులతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలకు గురి కాకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టారు.



## కేశఖండన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**పెళ్లకూరు మేజర్‌న్యూస్:** మండలంలోని పునబాక గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు నర్రావుల లోకేష్ నాయుడు వారి నివాసంవద్ద ఆదివారం ఏర్పాటు చేసిన కేశకండన కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ శాసన సభ్యురాలు డా.నెలవల విజయశ్రీ, పార్థసారధి పాల్గొన్నారు. ఆయన నివాసానికి విచ్చేసి వారికి శుభాకాంక్షలు తెలియ చేసారు. అదేవిధంగా పునబాక



గ్రామ రెవిన్యూలోని 1.5 ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రామంలోని దళితుల కోరిక మేరకు సర్వే చేయించి ఇళ్ల పట్టాల పంపిణి చేస్తామని వారు హామీ ఇచ్చారు.దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు వేలూరు మురళి కృష్ణా రెడ్డి,మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య,సర్పంచ్ ల సంఘం కార్యానిర్వాహక కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్ రెడ్డి,నాయకులు శిరసనంభేటీ చైతన్య కృష్ణా రెడ్డి,దువ్వూరు రాకేష్ రెడ్డి, తాళ్ల యుగంధర్ గౌడ్,పునబాక పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

## మన్ కీ బాత్‌కు ప్రపంచ వ్యాప్తంగా స్పందన - బిజెపి నేత డా.చంద్రప్ప

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న మన్‌కీ బాత్ కార్యక్ర



మానికి ప్రపంచవ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందని బీజేపీ తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప అభిప్రాయపడ్డారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కండ్రిగ ఉమ, 109 వ పోలింగ్ బూత్ అధ్యక్షురాలు ప్రియాంక, పోలింగ్ బూత్ సభ్యులు పరంజ్యోతి, వార్డు సభ్యులతో కలసి టీవీలో ప్రసారమైన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెల చివరి ఆదివారం ప్రసారమయ్యే ఈ కార్యక్రమం దేశ ప్రజలకు ప్రేరణాత్మకంగా మారిందన్నారు. మోదీ తన మనసులో మాటలను ప్రజలతో పంచుకుంటూ, సామాజిక, సాంస్కృతిక, శాస్త్రీయ, క్రీడా రంగాలతో పాటు అభివృద్ధి అంశాలపై విలువైన సందేశాలను అందిస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన మన్ కీ బాత్ ఎపిసోడ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మధ్యప్రదేశ్‌లో యువ ఫుట్‌బాల్ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రస్తావించారని, అది విన్న జపాన్‌కు చెందిన ఒక సంస్థ ఆ క్రీడాకారులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి ముందుకు రావడం ఈ కార్యక్రమ ప్రభావానికి నిదర్శనమని చంద్రప్ప వివరించారు. ప్రధాని ప్రసంగాలు ద్వారా దేశవ్యాప్తంగా లక్షలాది మందికి ఉత్సాహం, ఆత్మవిశ్వాసం పెరుగుతోందని, ప్రతి ఒక్కరూ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించి అందులోని స్ఫూర్తిని ఆచరణలోకి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు.



## ఎంపీని కలిసిన జేఏసీ వైస్ ప్రెసిడెంట్

**పలమనేరు మేజర్‌న్యూస్:** చిత్తూరు జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులు దళిత హక్కుల ఉల్లంఘన పై చిత్తూరు ఎంపీ దగ్గు మల్ల ప్రసాద్ రావు ను జేఏసీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ కె.పి చంద్రకుమార్ మర్యాదపూర్వకంగా కలిసి దళితులపై జరుగుతున్న దాడులు దళిత హక్కుల ఉల్లంఘన పై మాట్లాడారు. అనంతరం పలమనేరు నియోజకవర్గంలో ఎస్సీ ఎస్టీల యువత ఉద్యోగ కల్పన లేకుండా పడుతున్న కష్టాలను వివరించారు. అదేవిధంగా దళిత భూముల పరిరక్షణ, దళిత రైతులకు వ్యవసాయ భద్రత కల్పించాలని కోరారు. జేఏసీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ చంద్రకుమార్, సంఘ సభ్యులను ఎంపీ ఆప్యాయంగా పలకరించి వారి వివరించిన విషయాలను కచ్చితంగా పరిశీలిస్తామని తెలిపారు.

## మహిళ అదృశ్యం.. ఎఫ్ఐఆర్ నమోదు

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** పట్టణ పరిధిలోని మేలుపట్లకు చెందిన మునీంద్ర భార్య కోమల(19) శనివారం రాత్రి నుండి కనబడడం లేదని భర్త మునీంద్ర ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఎస్ఐ రమణ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

**తడ, మేజర్‌న్యూస్:** మండలంలోని చేనిగుంట పంచాయతీ లో తడ మండల వ్యవసాయ సోసైటీ అధ్యక్షులు వేనాటి శ్రీకాంత్ రెడ్డి అర్హులైన పేదలకు ఆదివారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం




జరిగింది. అనంతరం శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిరుపేదలకు ఎలాంటి అసౌకర్యాలు కాకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రజలకు వివరించారు ఈ పంచాయతీలో ఇంకా ఎవరైనా నిరుపేదలు ఉంటే వారు కూడా తప్పకుండా రేషన్‌కార్డు కొరకు నమోదు చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ దీపాలక్ష్మి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నివాసంలో చోరీ

**పలమనేరు, మేజర్‌న్యూస్:** నివాసంలో చోరీ జరిగిన సంఘటన పట్టణంలో ని రాధా బంగ్లాలో చోటుచేసుకుంది. ఎస్సై లోకేష్ కథనం మేరకు వివరాలు ఇలా.... పలమనేరు పట్టణంలోని రాధా బంగ్లా లో నివాసం ఉంటున్న రామ్మూర్తి నాయుడు అతని సొంత పని నిమిత్తం బెంగళూరుకు వెళ్ళాడు. ఆ ఇంటిలో సౌజన్య అనే అమ్మాయి ఇంటిలో ఉంటుంది. ఆమె రూరల్ మండలంలోని కుల మాసనపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న సాకే ఊరు సొంత గ్రామంలో కోళ్ళ వ్యాన్ లో ఎక్కించడానికి అక్కడికి వెళ్ళింది. నివాసంలో ఎవరు లేదని తెలుసుకొని గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. నివాసంలో దాదాపు 660 గ్రాములు బంగారం మాత్రమే దొంగలించుకుని వెళ్లారు. జరిగిన విషయాన్ని సౌజన్య రామ్మూర్తి నాయుడుకు తెలపడంతో రామ్మూర్తి నాయుడు వెంటనే పోలీసులకు సమాచారం



అందించారు. అక్కడికి వెళ్లిన పలమనేరు అర్బన్ సీఐ కృష్ణమోహన్, ఎస్సై లోకేష్ తమ సిబ్బందితో వెళ్లి దొంగతనం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం రామ్మూర్తి నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి బయలుదేరి వెళ్లారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.







## గణేష్ నిమజ్జనంకు వెళ్లే మార్గాలను పరిశీలించిన

# జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు

**తిరుపతి బ్యూరో,మేజర్ న్యూస్ :** తిరుపతి లోని లక్ష్మీపురం జంక్షన్, పూర్ణ కుంభం సర్కిల్, లీలామహల్ సర్కిల్, గోవింధ నగర్, వినాయక సాగర్ ఆదివారం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు పరిసర ప్రాంతాలను పరిశీలించారు.వినాయక నిమజ్జనం కు పోలీసు వారు రెవెన్యూ డిపార్ట్మెంట్ సంయుక్తంగా 600 మంది బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. వినాయక సాగర్ చుట్టూ నాలుగు పెద్ద క్రేన్స్ తో నిమజ్జనం చేస్తున్నామని గణేష్ విగ్రహాలు నిమజ్జనం కు వెళుృతున్న రూట్ మ్యాప్ లో ట్రాఫిక్ కు ఎలాంటి ఇబ్బందులు కల్గికుండా చూడాలని అధికారులను అదేశించారు ఎస్పీ,అదే సమయంలో నిమజ్జనాలకు వెళ్ళుతున్న వినాయక విగ్రహాలకు ఆటంకం కలగకుండా చూడాలని ఆదేశించారు.లీలా మహల్ సర్కిల్ వద్ద నిమజ్జనం కు వెళ్ళుతున్న విగ్రహాలను అధికారులతో కలిసి పరిశీలించిన ఎస్పీ,ఆకాశమార్గంలో నగరంలో ఏఏ ప్రాంతంలో డ్రోన్ కెమెరాలు ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వినాయక నిమజ్జనం అయేంత వరకు ఆకాశ మార్గంలో డ్రోన్ కెమెరాలతో నిఘా ఎర్పాటు చేయాలన్నారు.అదే విధంగా ఎదైన అలజడి జరుగుతున్నట్లు డ్రోన్ కెమెరాల కంట పడితే... వేంటనే డ్రోన్ కెమెరా సిబ్బంది.. అధికారులకు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేయాలన్నారు. పోలీసు వారు వినాయక ఉత్సవ కమిటీ సంయుక్తంగా ఇచ్చిన రూట్ మ్యాప్ లోనే వినాయక విగ్రహాలు నిమజ్జనాని వెళ్ళాలన్నారు.సాంప్రదాయ పద్దతి లోనే వినాయక నిమజ్జనం జరగలాన్నారు. ఇతర ప్రాంతాల నుండి వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు వస్తున్న ట్రాక్టర్లు, లారీలు, టాటా ఏసి వాహనాలలో వస్తున్న సమయంలో జాగ్రత్త వహించాలన్నారు. గోవింధ నగర్ వద్ద ఎర్పాటు చేసిన తిరుపతి వరసిద్ధివినాయక ఉత్సవ కమిటీ వారు వద్ద ఆహ్వానం మేరకు ఎస్పీ ప్రత్యేక పూజలు చేసి, నిమజ్జనం కు వెళ్ళుతున్న వినాయక విగ్రహాలకు హారతులు ఇవ్వడం జరిగింది. వినాయక సాగర్ వద్ద పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు వినాయక నిమజ్జనం చేసేందుకు వచ్చిన భక్తులతో ఏర్పాట్లు గురించి అడిగి తెలుసుకున్నారు. నిమజ్జనం కు వచ్చి వాలెంటర్ గా విధులు నిర్వహిస్తున్న యువకులతో మాట్లాడి... నిమజ్జనం చేసేందుకు వస్తున్న విగ్రహాలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చేస్తున్నందుకు పోలీసు వారి తరుపున అభినందించారు,వినాయక సాగర్ వద్ద ఇన్ గేట్ లోంచి వస్తున్న వినాయక విగ్రహాలను వస్తున్న తీరును పరిశీలించారు. ఎప్పటికప్పుడు ట్రాఫిక్ కంట్రోల్ చేసుకునే విధంగా చూడాలని సిబ్బంది ని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు.అదేవిధంగా జేబు దొంగతనాలు, సెల్ ఫోన్స్ దొంగతనాలు జరగకుండా జాగ్రత్త గా చూడాలని క్రైం ఏఎస్పిని ఆదేశించారు.



# ఉపాధ్యాయ వృత్తిలో అంకిత భావంతో పనిచేసిన చంగప్ప

## సమావేశంలో ప్రసంగించిన వక్తలు

**పలమనేరు మేజర్ న్యూస్** తన ముప్పై ఆరు ఏళ్ళ ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో అంకిత భావంతో పనిచేసిన చంగప్ప తను పనిచేసిన చోటల్లా అందరి అభిమానాలు పొందారని సమావేశంలో ప్రసంగించిన వక్తలు తెలిపారు.గంగవరం మండలం జిఎల్ఎస్ ఫారం జడ్పీ ఉన్నతపాఠశాలలో పనిచేస్తూ ప్రధానోపాధ్యాయులు చంగప్ప ఆదివారం పదవీ విరమణ చెందారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పదవీ విరమణ సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి విచ్చేసిన వక్తలు మాట్లాడుతూ.....గత ముప్పై ఆరు సంవత్సరాలుగా ఉపాద్యాయ వృత్తిలో వుంటూ ఎందరో విద్యార్థులను తీర్చిదిద్ది ఉన్నతులుగా చేశారన్నారు.తమ పిల్లలను కూడా డాక్టర్ లుగా చేసి సమాజానికి ఆరోగ్య సేవలు అందించాలని కోరుకున్నారన్నారు. ఉపాద్యాయులు వృత్తికి మాత్రమే పదవీవిరమణ అని సమాజానికి, సేవలకు కాదన్నారు.తన కుటుంబ సభ్యులందరినీ ఈ పదవీ విరమణ కార్యక్రమంలో భాగస్వాములు చేయడం,మాట్లాడించడం ఓ గొప్ప అనుభూతి అని అభిప్రాయం వ్యక్తం చేశారు.ఉద్యోగులు ప్రతి ఒక్కరూ చివరి దశలో పదవీ విరమణ చెందుతారని అయితే ఉపాద్యాయులుగా పనిచేసి ఎందరికో విద్యాబుద్ధులు నేర్పి సమాజానికి వెలుగులు నింపుతున్న ఉపాద్యాయ వృత్తి గొప్పదన్నారు. కార్యక్రమంలో సన్మాన గ్రహీత చంగప్ప బంధువులు, మిత్రులు, ప్రజాప్రతినిధులు, శ్రేయోబి ,లాషులు, ప్రధానోపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో ఉపాద్యా యులు పాల్గొని చంగప్ప దంపతులను సత్కరించి ఆయన కుటుంబానికి ఆయురారోగ్యాలు కలగాలని, ఆయన శేష జీవితం సుఖశాంతులతో కొనసాగాలని కోరుకున్నారు. ప్రసంగించిన వారిలో రిటైర్డు చిత్తూరు డివైఈఓ వాసుదేవ నాయుడు,మాజీ ఉపాధ్యాయ సంఘం నేత సోమచంద్రారెడ్డి, రిటైర్డు ప్రధానోపాధ్యాయులు పరశురాం, తాజుద్దీన్,ఉపాద్యాయ సంఘం నేతలు రమణ, రామయ్య,విజయశేఖర్, రమ, విజయ కుమార్ లు ఉన్నారు.ఇంకనూ సిఆర్పీ హెచ్ఎంలు నాగరాజు, రమేష్, చెంగల్ రెడ్డి, జ్యోతీశ్వరన్, గణపతి నాయుడు లతో పాటు ఆ పాఠశాల ఉపాధ్యాయులు పట్టాభి,సంగీత, సురేష్ తదితర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా గణనాధుని ఊరేగింపు



**బాలాయపల్లి,మేజర్ న్యూస్** బాలయపల్లి మండలం జయంపు రజిక వీధిలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం నాడు గణనాధుని విగ్రహాన్ని మేళ తాళాలు బాజా భజంత్రీలు.మధ్య ట్రాక్టర్ పై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఇంటిల్లిపాదిగా మహిళలు పిల్లలు గణనాధునికి హారతులు ఇచ్చి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ అడ్డంకులను తొలగించే ప్రభువు గణపతిని మనమందరం ఉత్సాహంతో పూజించాలని వినాయక చవితి శోభతో ప్రతి ఇంట్లో సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యంతో ఉండేలా ఆ వినాయకుని ఆశీస్సులతో సంతోషంగా ఉండాలని కమిటీ సభ్యులు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో చిరమన వెంకయ్య. బాలకృష్ణయ్య. వేణు. సుబ్బారావు. అనిల్. వికాస్. సంతోష్. చిలుకూరు వెంకటేష్. సుబ్బు. ప్రసాద్. వెంకీ కమిటీ సభ్యులు ఉన్నారు.

## పుంగనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ సమీపతి యాదవ్‌ను కలిసిన కమిటీ సభ్యులు



**పలమనేరు మేజర్ న్యూస్** ఆదివారం ఉదయం 10 గంటలకు పుంగనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ సమీపతి యాదవ్ కార్యాలయం నందు పలమనేరు నియోజకవర్గ బీసీ జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్, రెడ్డి శేఖర్ యాదవ్, మధు యాదవ్, శ్రీనివాస్ యాదవ్, తదితరులు వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం పలమనేరు యాదవుల సంఘం తనను కలిసినందుకు సంతోషంగా ఉందని పుంగనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ సమీపతి యాదవ్ సంతోషాన్ని వ్యక్తం చేశారు.